thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com


RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 36 | జగిత్యాల | శనివారం | 25 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

కోహ్లీ గర్జన-ఆర్సీబీ విజయం



11

## పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే

# హిల్ట్ పాలసీ

నగరంలో కాలుష్యరహిత వాతావరణం కోసం కృషి

పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతల తరలించే ప్రతిపాదన



- చైనా తరహాలో ఇండస్ట్రియల్ బ్లాక్ అభివృద్ధి
- భూముల ధరలను పెంచడానికి నిర్ణయం
- కేబినెట్ సబ్‌కిటీ భేటిలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, ఏప్రిల్ 24:** సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. సవరించిన మార్కెట్ విలువలను అమలు చేయాలని నిర్ణయించింది. మే మొదటి వారం నుంచి రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెరగనున్నాయి. పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ హిల్ట్ పాలసీ అమలుకానున్నట్లు కేబినెట్ సబ్ కమిటీ తెలిపింది. ఓఆర్ఆర్ బయట ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఆదాయ సమీకరణపై అశ్రద్ధ వహిస్తే వేటు తప్పదని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ హెచ్చరించింది.

మిగతా 2 లో





# సమ్మె సుఖాంతం

- ప్రభుత్వంతో చర్చలు సఫలం!
- కార్మికుల డిమాండ్లకు గ్రీన్ సిగ్నల్..
- నేటి నుంచి రోడ్డెక్కనున్న బస్సులు
- డిప్యూటీ సీఎం సమక్షంలో 12 గంటల పాటు మారథాన్ చర్చలు..
- విలీనంపై చారిత్రక నిర్ణయం

రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఆర్టీసీ సమ్మెకు ఎట్టకేలకు తెరపడింది. ప్రభుత్వం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య శుక్రవారం సచివాలయంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. సుమారు 12 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ భేటీలో కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

వివరాలు 2లో..



## డ్రైవర్ శంకర్‌గౌడ్ కన్నుమూత

చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి..

కన్నీటిపర్యంతమైన కుటుంబ సభ్యులు

సీఎం రేవంత్, మంత్రి పొన్నం దిగ్భ్రాంతి 2

మృతదేహం తరలింపులో ఉద్రిక్తత!

## భారీగా ఐపీఎస్‌ల బదిలీ





హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి..

ఏడుగురు సీనియర్ అధికారుల మార్పు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ రామకృష్ణారావు

.. వివరాలు 2లో



## ఎస్ఎల్బీసీ సొరంగం పనుల్లో ‘భద్రత’కే పెద్దపీట

- ప్రమాదాల నివారణకు ఎన్జీఆర్ఐ నివేదిక అమలు
- కాళేశ్వరం బ్యారేజీల పరిశోధనల్లోనూ భాగస్వామ్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 2



## మిలీనియం మార్చ్ కేసు కొట్టివేత

కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుకు ఊరట

.. వివరాలు 2లో

## పంటలన్నీ కేంద్రమే కొనాలి



- రాష్ట్రాలపై భారం వద్దు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖరీఫ్ సాగుపై అధికారులతో సమీక్ష..
- సన్న వరి రకాల ఎంపికపై ప్రత్యేక దృష్టి
- విత్తన లభ్యత, బోనస్‌పై పకడ్బందీ ప్రణాళిక

3



## ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత

44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత

2

## నేడే కల్వకుంట్ల కవిత పార్టీ ప్రకటన!

- పార్టీపేరును ప్రకటించనున్న కవిత
- కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
- తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

తెలంగాణ రాజకీయ యవనికపై మరో కొత్త అధ్యాయం మొదలుకానుంది. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూనే క్షేత్రస్థాయిలో పావులు కదిపిన ఎమ్మెల్సీ కవిత, ఇప్పుడు సొంత గూడును వీడి సరికొత్త పంథాలో జనంలోకి రానున్నారు. ‘ఇంటి పార్టీ’తో బంధం తెంచుకుని, ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలన్న ఆమె ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చనుంది. ఈ పరిణామం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో కొత్త చర్చకు దారితీస్తోంది.



3

## సమయం మించిపోతోంది లొంగిపోండి!



- అణ్వాయుధాల అవసరం లేదు..
- సంప్రదాయ యుద్ధంతోనే నాశనం చేస్తాం
- ట్రూత్ సోషల్‌లో అమెరికా అధ్యక్షుడి సంచలన పోస్ట్

4



4


## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

## హిమాలయాల్లో హరహర మహాదేవ

- తెరుచుకున్న కేదార్‌నాథ్ ద్వారాలు!
- ఆరు నెలల విరామం తర్వాత జనసందోహం
- తొలిరోజే పోటెత్తిన యాత్రికులు
- చార్‌ధామ్ యాత్రలో ఆధ్యాత్మిక వైభవం..
- క్యూలైన్లలో తోపులాట, ఘర్షణ

4






# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

**హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్**

**ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి..**

**ఏడుగురు సీనియర్ అధికారుల మార్పు**

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్, ఏప్రిల్24: తెలంగాణ రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్రంలోని ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించడంతో పాటు, అదనపు బాధ్యతలను కూడా కేటాయించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖాగోయల్ నియమితులయ్యారు. అలాగే, విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్‌ను బదిలీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' కమిషనర్‌గా తరుణ్ జోషిని నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీజోన్-2 ఐజీగా నియమితులైన షానవాజ్ ఖాసింకు పోలీస్ పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా నియమితులైన అవినాష్ మొహంతికి ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వడం గమనార్హం. ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బీ సుమతి బాధ్యతలు చేపట్టనున్నారు. పరిపాలనలో వేగం పెంచడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత పటిష్టమైన చర్యల కోసమే ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# మిలీనియం మార్చ్ కేసు కొట్టివేత

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఊరట**



**హైదరాబాద్, ఏప్రిల్ 24:** హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది. 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాదులు వాదించారు. పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

# ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత

**44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత**



**కరీంనగర్, ఏప్రిల్ 24:** ఉత్తర తెలంగా భగ్గుమంటోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత శుక్రవారం పెద్దపల్లి జిల్లా అకెనపల్లిలో రికార్డయింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.1, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్టులో 43.8, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల అయిదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల స్థాయిలోనే నమోదవుతాయని, కనిష్ఠంగా రాత్రి ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీలకు పెరుగుతాయని జగిత్యాల పరిశోధనకేంద్రం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. గాలిలో తేమ ఉదయం 30-50 శాతం, మధ్యాహ్నం 10-15 శాతం వరకు ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని చెప్పారు.

# పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హిల్ట్ పాలసీ

మొదటి పేజీ తరువాయి

కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల వసతి కోసం డార్మెటరీలు తప్పనిసరి చేసింది. కాగా, రాష్ట్రంలో వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్ఠంగా రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎకరాకు 6 లక్షల రూపాయలుగా ఉన్న విలువ 12 లక్షల రూపాయల నుంచి 18 లక్షల రూపాయల వరకు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాదు నగరం తో పాటు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ తీసుకువచ్చిందని, ఈ పాలసీని ప్రజాస్వామ్య పద్ధతిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. పాలసీపై సమీక్ష సమావేశంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు సైతం పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు. ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో కాలుష్యకారక పరిశ్రమలు అన్నిటిని ఓఆర్ఆర్ అవతలికి తరలించాలని కంపల్సరీ చేస్తే అందరూ వెళ్ళిపోతారని కొందరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధులు స్వయంగా చెప్పినప్పటికీ, మేం అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు పోతున్నామని



డిప్యూటీ సీఎం వివరించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద భూములను అభివృద్ధి చేసే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఇండస్ట్రియల్ పార్కుల ప్రతినిధులు కలిసి అభివృద్ధి చేసుకునే ఆలోచన చేయాలి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తే మంచిదని, చైనా తరహాలో ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు సూచించారు ఈ సూచనలను స్వాగతిస్తున్నాం, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఎవరిని ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన తమకు లేదని నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ లక్ష్యం అన్నారు. ఓ.ఆర్.ఆర్ లోపల ఉన్న అన్ని ఇండస్ట్రియల్ అసోసియేషన్ తో కూర్చొని చర్చించి పాలసీ అమలును వేగవంతం చేసుకుందాం అని డిప్యూటీ సీఎం సూచించారు. పాలసీ గై÷-లడైన్స్ రూపొందించే ముందు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధుల ఆలోచనలకు చోటు కల్పించే ప్రయత్నం చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు బాగా నడవాలి, కాలుష్యం ఉండకూడదని, పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం చాలా ఓపెన్ గా ఉందని కమిటీ సభ్యుడు మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల కోసం డార్మెటరీలు తప్పనిసరి చేశామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హిల్ట్ పాలసీని స్వాగతిస్తున్నామని చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డి శ్రీనివాస్ రెడ్డి సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం మేము ఉంటున్న భూములను 30 సంవత్సరాల క్రితమే ఆనాటి ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశామని వివరించినట్టు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# ఎస్ఎల్బీసీ సొరంగం పనుల్లో 'భద్రత'కే పెద్దపీట

**ప్రమాదాల నివారణకు ఎన్జీఆర్ఐ నివేదిక అమలు**

**కాళేశ్వరం బ్యారేజీల పరిశోధనల్లోనూ భాగస్వామ్యం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్24 :** శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం తవ్వకాల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కేపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగం తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలపై నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) రూపొందించిన సమగ్ర నివేదికను శుక్రవారం సచివాలయంలో మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్జీఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త సత్యనారాయణ నివేదిక ప్రతిని మంత్రికి అందజేశారు. సొరంగ మార్గం తవ్వకాల సమయంలో గతంలో జరిగిన దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఎన్జీఆర్ఐతో సమగ్ర సర్వే నిర్వహించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పరిశోధనల్లో సీసీమిక్ ఇమేజింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు వినియోగించారు. సొరంగం పైభాగంలోని భూమి స్వభావం, ఒత్తిడి మండలాలు, భూగర్భ జలాల ఊటలు వంటి అంశాలను ఈ నివేదికలో పొందుపరిచారు. శాస్త్రవేత్తల మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ తవ్వకాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎల్బీసీ పనులతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల్లోనూ ఎన్జీఆర్ఐ భాగస్వామ్యం కావాలని కోరారు. బ్యారేజీల పునాదుల పటిష్టతను పరీక్షించేందుకు భూపరిశోధనలు నిర్వహించడంలో శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఎస్ఎల్బీసీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఎలక్ట్రిక్ లోడర్లు, భారీ డంపర్ల సహాయంతో ఇప్పటివరకు 151.50 మీటర్ల మేర తవ్వకం పూర్తయిందని మంత్రి వివరించారు. అంతర్జాతీయ స్థాయి యంత్ర సామగ్రిని సమీకరించి, రెండు వైపులా కలిపి నెలకు కనీసం 200 మీటర్ల మేర తవ్వకాలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఈఎన్సీ రమేష్ బాబు, సొరంగ మార్గ నిపుణుడు పరిక్షిత్ మెహ్రా, ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# సమ్మె సుఖాంతం

**ప్రభుత్వంతో చర్చలు సఫలం!**

**కార్మికుల 32 డిమాండ్లకు సర్కార్ గ్రీన్ సిగ్నల్..**



**హైదరాబాద్, ఏప్రిల్24:** రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఆర్టీసీ సమ్మెకు ఎట్టకేలకు తెరపడింది. ప్రభుత్వం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య శుక్రవారం సచివాలయంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. సుమారు 12 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ భేటీలో కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ నేతలు ప్రకటించారు. ఫలితంగా ఆదివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే ఆర్టీసీ బస్సులు యధావిధిగా రోడ్లపైకి రానున్నాయి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎంపీ వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల దశాబ్దాల కల అయిన 'ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం' ప్రక్రియపై ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో పాటు కొత్త వేతన సవరణ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం హామీ ఇచ్చింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలపై కూడా ఈ భేటీలో చర్చ జరిగింది. నెలకు సుమారు 400 కోట్ల రూపాయల చొప్పున నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని మంత్రుల బృందం కార్మిక నేతలకు భరోసా ఇచ్చింది. చర్చల సఫలంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులకు ఊరట లభించింది. రెండు రోజులుగా నిలిచిపోయిన రవాణా వ్యవస్థ మళ్లీ పట్టాలెక్కనుంది. చర్చల అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం సానుకూల ధోరణితో స్పందించిందని, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చిందని తెలిపారు. డ్రైవర్ శంకర్‌గౌడ్ బలిదానం వంటి విషాద సంఘటనల నేపథ్యంలో, ఈ నిర్ణయం కార్మిక కుటుంబాల్లో కొంత ఉపశమనాన్ని నింపింది.

# నర్సంపేట డ్రైవర్ శంకర్‌గౌడ్ కన్నుమూత

- **చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి..**
- **కన్నీటిపర్యంతమైన కుటుంబ సభ్యులు**
- **సీఎం రేవంత్, మంత్రి పొన్నం దిగ్భ్రాంతి**

**హైదరాబాద్, ఏప్రిల్24 :** రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్‌గౌడ్ (55) చికిత్స పొందుతూ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి శుక్రవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం వరంగల్ జిల్లా నర్సంపేట డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన శంకర్‌గౌడ్ తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. 80 శాతం మేర శరీరం కాలిపోవడంతో ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. ఆసుపత్రిలో శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా, స్వస్థలానికి తరలించారు. ఆయన అంత్యక్రియలకు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది - ముఖ్యమంత్రి**

శంకర్‌గౌడ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచిందని విచారం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా శంకర్‌గౌడ్ మృతికి సంతాపం ప్రకటించారు. కార్మికులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యల వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

# నర్సంపేటకు శంకర్‌గౌడ్ మృతదేహం

**వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**

**బండి సంజయ్‌తో పోలీసుల వాగ్వాదం**

**వరంగల్, ఏప్రిల్ 24:** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ స్వగ్రామం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ముత్తోజిపేటకు చేరుకుని కేంద్ర మంత్రితో మాట్లాడారు. నర్సంపేట డిపోకు శంకర్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో ముత్తోజిపేటలో పరిస్థితి బండి సంజయ్ వర్సెస్ పోలీసులు అన్నట్టుగా మారింది. శంకర్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహించాల్సిన కొడుకు హేమంత్‌ను బీజేపీ నేతలు నర్సంపేట డిపోకు తీసుకెళ్లారు. అయితే శంకర్ గౌడ్ డెడ్ బాడీని తిరిగి కూతురు ఇంటికి తరలించారు పోలీసులు. దీంతో ఆర్టీసీ డ్రైవర్ అంత్యక్రియలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎట్టిపరిస్థితుల్లో శంకర్ మృతదేహాన్ని డిపోకు తరలించాలని బండి సంజయ్ పట్టుబడుతుండగా.. అనుమతి లేదని పోలీసులు తేల్చి చెబుతున్నారు. దీంతో 365 జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అంతకుముందు శంకర్ గౌడ్ మృతదేహానికి కేంద్ర మంత్రి నివాళులర్పించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లనీయకపోవడం దారుణమని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ క్రియేట్ చేస్తోందని ఆరోపించారు. మానవతా విలువలు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సంప్రదాయాలను విస్మరిస్తోందని అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ నేతలు ఆర్టీసీ కార్మికుల దగ్గరకు వెళ్లి రాజకీయం చేయలేదా అని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లనివ్వకపోతే రేపటి వరకూ బాడీ ఇక్కడే ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం కుటుంబ సభ్యులకైనా మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లే అవకాశం కల్పించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ముత్తోజిపేట నుంచి కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లిపోయారు. బండి సంజయ్‌తో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు మాట్లాడారు. అంత్యక్రియల విషయంలో కుటుంబసభ్యులకు అభ్యంతరం లేకపోతే తనకూ అభ్యంతరం లేదంటూ ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో శంకర్ గౌడ్ అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# నేడే కల్వకుంట్ల కవిత పార్టీ ప్రకటన!

- పార్టీపేరును ప్రకటించనున్న కవిత
- కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
- తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 24:** తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు.



కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బందం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- 8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు
- ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 24 :** రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల పక్రియపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు,÷నాన్స్,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు పక్రియ ప్రారంభం అయ్యిందని,సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. క్షేత్రస్థాయి నుండి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను 12 లక్షల మెట్రిక్ టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామని,మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు గాను జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు ఆయన తెలిపారు.అంతే గాకుండా ధాన్యం కొనుగోలుకు గాను కొనుగోలు కేంద్రాలలో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తేమను త్వరితగతిన కొలిచేందుకు వీలుగా ప్యాడి క్లినర్లు,డ్రైయర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడ కుడా ఆలస్యం జరగకుండా చూసేందుకు గాను సరిపడా హమాలిలను నియమించాలన్నారు. తూకం పక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్ల కుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా ప్రాంతంలో ఉన్న మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యాం తరలి రాకుండా ఉండేలా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అయ్యో మొత్తాలను రైతులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా పౌర సరఫరాలశాఖా మార్కెటింగ్ శాఖలతో పాటు జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

# పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

**మొదటిదశలో 110కి పైగా సీట్లు గెలుస్తాం**

**కేంద్రహోంమంత్రి అమిత్ షా ధీమా**



**కోల్‌కతా, ఏప్రిల్ 24:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన కోల్‌కతాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మొదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. మరోవైపు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ పక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

**10 థీమ్‌లపై శాఖల వారీగా కార్యక్రమాలు**

**డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం**

**హైదరాబాద్, ఏప్రిల్ 24:** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్‌లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత–ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్– ఆలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం



చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.



# పంటలన్నీ కేంద్రమే కొనాలి

**రాష్ట్రాలపై భారం వద్దు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**


**హైదరాబాద్, ఏప్రిల్24 :** కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించిన ప్రతి పంటను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ ప్రకటించి, కొనుగోలు బాధ్యతను రాష్ట్రాలపై నెట్టివేయడం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మరియు ఉన్నతాధికారులతో కలిసి రాబోయే వానాకాలం సీజన్ సాగు సన్నద్ధతపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే సన్న వరి రకాలకు సంబంధించి విత్తన లభ్యత, మార్కెట్ డిమాండ్‌పై మంత్రి అధికారులకు కీలక సూచనలు చేశారు. గత ఏడాది దాదాపు 33 రకాల సన్న బియ్యాన్ని సాగు చేయడం వల్ల, విక్రయాల సమయంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యంగా కొన్ని రకాలకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అందక రైతులు నష్టపోయినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈసారి అలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడాలని ఆదేశించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి, రైతులకు గిట్టుబాటు అయ్యే రకాలను మాత్రమే సాగు చేసేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, సాగు ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించిన మేలైన వరి రకాలను రైతులకు పరిచయం చేయాలని, విత్తన సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు రాబోయే సీజన్ కోసం సిద్ధం చేసిన వివిధ రకాల విత్తనాల వివరాలను మంత్రికి వివరించారు.

# బీజేపీ ఆఫీసులో ప్రీతి రెడ్డి!

**చేరిక వార్తలపై మల్లారెడ్డి కోడలి క్లారిటీ**

**మా మామ బీఆర్ఎస్ లోనే ఉంటారు**

**నాయకురాలి వివరణతో రూమర్లకు చెక్**





**హైదరాబాద్, ఏప్రిల్ 24:** గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.



# ఏపీ మంత్రికి కేటీఆర్ పరామర్శ

**హైదరాబాద్, ఏప్రిల్ 24 :** ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆరఎస్ ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ రాజు




## సంపాదకీయం

# ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులుకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. ముందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతునానారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనపుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించచుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

# ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

- బీజేపీలో చేరుతున్న రాఘవచద్దా తదితరులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు.



ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నే కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# సమయం మించిపోతోంది.. వెంటనే లొంగిపోండి!

- అణ్వాయుధాల అవసరం లేదు.. సంప్రదాయ యుద్ధంతోనే నాశనం చేస్తాం
- ట్రూత్ సోషల్‌లో అమెరికా అధ్యక్షుడి సంచలన పోస్ట్

**వాషింగ్టన్:** ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ సైన్యం ఇప్పటికే కుప్పకూలిపోయిందని, వారితో ఒప్పందానికి సమయం మించిపోతోందని స్పష్టం చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మరియు తన 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇరాన్‌పై అణ్వాయుధాలు ప్రయోగిస్తారన్న వార్తలను ట్రంప్ కొట్టిపారేశారు. "నేను అణ్వాయుధాలను ఎందుకు ఉపయోగిస్తాను? అది లేకుండానే సంప్రదాయ యుద్ధ పద్ధతుల్లో వారిని ఇప్పటికే నాశనం చేశాం. అసలు ప్రపంచంలో ఎవరూ



అణ్వాయుధాలను వాడటానికి అనుమతించకూడదు" అని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో తూతూమంత్రంగా కాకుండా, దీర్ఘకాలికంగా ఉండే బలమైన ఒప్పందంపైనే తన దృష్టి ఉందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ పాలకులకు తక్కువ సమయం ఉందని హెచ్చరిస్తూ ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు. "నాకు చాలా సమయం ఉంది, కానీ ఇరాన్‌కు లేదు. వారి నాయకత్వం బలహీనపడింది, సైన్యం చిన్నాభిన్నమైంది. మేము విధించిన ఆర్థిక, సైనిక దిగ్బంధనం అద్భుతంగా పనిచేస్తోంది. ఇకపై పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది" అని అందులో రాసుకొచ్చారు. హర్మూజ్ జలసంధిలో మైన్లు పెట్టి ఇరాన్ పెద్ద తప్పు చేసిందని ఆయన మండిపడ్డారు. ఇటీవల ఇరాన్ పతాకంతో ఉన్న ఒక వాణిజ్య నౌకను అమెరికా సీజ్ చేసిన ఉదంతంపై ట్రంప్ స్పందించారు. ఆ నౌకలో చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్న ఒక 'బహుమతి' ఉందని, అయితే అది అత్యంత రహస్యమైన విషయం కావడంతో వివరాలు వెల్లడించలేనని ఆయన సస్పెన్స్ రేపారు. మరోవైపు ఇజ్రాయెల్ – లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను మరో మూడు వారాల పాటు పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాల నాయకులు త్వరలోనే వైట్‌హౌస్‌లో సమావేశమై శాంతి చర్చలు జరిపే అవకాశం ఉందని వెల్లడించారు. మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనాలంటే ఇరాన్ తన పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

- బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది
- ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ

**కోల్‌కతా, ఏప్రిల్ 24:** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు.



ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హావ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.







# హిమాలయాల్లో 'హరహర మహదేవ' నామస్మరణ

- తెరుచుకున్న కేదార్‌నాథ్ ద్వారాలు!
- ఆరు నెలల విరామం తర్వాత జనసందోహం
- తొలిరోజే పోటెత్తిన యాత్రికులు
- చార్‌ధామ్ యాత్రలో ఆధ్యాత్మిక వైభవం..
- క్యూలైన్లలో తోపులాట, ఘర్షణ





**డెహ్రాడూన్, ఏప్రిల్24 :** గఢ్వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలో కొలువైన పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్ ఆలయం ఆరు నెలల సుదీర్ఘ శీతాకాల విరామం తర్వాత భక్తుల కోసం బుధవారం (ఏప్రిల్ 22) పునఃప్రారంభమైంది. అశేష భక్తజన సందోహం మధ్య బాబా కేదార్‌నాథ్ దేవాలయ ద్వారాలు తెరుచుకోవడంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. యాత్ర ప్రారంభమైన తొలిరోజే వేలాదిగా భక్తులు తరలి రావడంతో కొండ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ దర్శనం కోసం భక్తులు భారీగా తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో భక్తుల్లో అసహనం వ్యక్తమైంది. ఒకానొక దశలో కొందరు భక్తులు నిబంధనలు అతిక్రమించి ఒక క్యూలైన్ నుంచి మరో క్యూలైన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో భక్తుల మధ్య వాగ్వివాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. పరిస్థితిని అదుపు చేయడం భద్రతా సిబ్బందికి సవాలుగా మారింది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏప్రిల్ 19వ తేదీన అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరవడంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ప్రారంభమైంది. ఏప్రిల్ 22న కేదార్‌నాథ్, ఏప్రిల్ 23న బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. శీతాకాలంలో హిమపాతం అధికంగా ఉండటం వల్ల ఆరు నెలల పాటు మూసివేసిన ఈ క్షేత్రాలు, తిరిగి నవంబర్ 11వ తేదీ వరకు భక్తులకు దర్శనమివ్వనున్నాయి. హిమాలయాల్లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో, యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్తరాఖండ్ ప్రభుత్వం మరియు దేవస్థాన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేశాయి. వైద్య సదుపాయాలు, తాగునీరు మరియు వసతి సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు వాతావరణ పరిస్థితులను గమనించి యాత్రకు సిద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు.

చురకలు

శనివారం 25 ఏప్రిల్ 2026

# బట్టుపెల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**కాగజ్నగర్:** కాగజ్నగర్ మండలంలోని బట్టుపెల్లి గ్రామంలో సిర్పూర్ పేపర్ మిల్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు పాల్గొని గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎస్పీఎం సంస్థకు గ్రామ సర్పంచ్ రాజేందర్ జాదవ్, వార్డు సభ్యుడు చెట్టి వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరారు.

# ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



**నేరడిగొండ:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి గ్రామపంచాయతీలో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వడూర్, నేరడిగొండ గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, కూలీల హాజరును పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో కనీసం 150 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, కూలీలను సమన్వయపర్చి ఉపాధి పనులు ముమ్మరంగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేఖర్, ఏపీఓ వసంతరావు, వడూర్ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

# సీఎస్సీ హెల్త్ కేర్లో ఉద్యోగ అవకాశాలు

**తాండూర్:** కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ) హెల్త్ కేర్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు టాస్ అధికారి రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సీఎస్సీ హెల్త్ కేర్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, జీఎన్ఎం, ల్యాప్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం కోర్సు పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో పనిచేయడానికి ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్: 8332006055, 7799669961, 6302355003 లపై సంప్రదించాలని సూచించారు.

# నర్మాల గ్రామ అభివృద్ధికి కృషి



**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక నాయకులు తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు ఆర్టీసీ బస్సులను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఐకేపీ కార్యకలాపాల నిర్వహణ కోసం సుమారు 10 ఎకరాల భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ భూమి కేటాయింపుతో గ్రామ మహిళా సంఘాలు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాలపై వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, రత్నాకర్, రమేష్ గౌడ్, రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు

## కొయ్యల ఏమాజి డిమాండ్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారి సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ డిపోలో కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, ఎఫ్సీఐ బోర్డు సభ్యులు పులగం తిరుపతి, కేశవరెడ్డి, గోవర్ధన్, విశాల్ ఖండ్రేలతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.ఈ సందర్భంగా కొయ్యల ఏమాజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు ముందే పరిష్కరించి ఉంటే ఆయన బ్రతికేవారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు 50 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, కార్మిక సంఘాలను రద్దు చేసి వారి హక్కులను కాలరాసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్మికులు ఎవరూ అధైర్యపడి అఘాయిత్యాలకు పాల్పడ వద్దని, బీజేపీ ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్కు ఉర్దూ జర్నలిస్టుల ఘన సన్మానం



**ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ అహ్మద్ను తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (TUWJU) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా జర్నలిస్టులు కొనియాడారు. ఆసిఫాబాద్ వైస్ చైర్మన్ మొహమ్మద్ అహ్మద్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పట్ల తాము ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటామని, పట్టణ అభివృద్ధిలో అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేయూ జిల్లా అధ్యక్షుడు మిర్జా సలీమ్ బేగ్, జిల్లా ఉర్దూ విభాగం అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడు మొహమ్మద్ అబేద్ అహ్మద్, ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మున్నవర్ ఉద్దీన్, కోశాధికారి సయ్యద్ ఇక్బాల్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి మొహమ్మద్ ఫయాజుద్దీన్, కార్యదర్శి మునవర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి





## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ :** విద్యావంతులైన నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ వారోత్సవాలలో భాగంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువత జీవితంలో స్థిరపడాలంటే నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించి మంచి స్థాయిలో జీతాలు అందిస్తున్నాయని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా నిరుద్యోగ యువతకు ద్విచక్ర వాహనాల రిపేరింగ్, సెల్ ఫోన్ రిపేరింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, హౌస్ వైరింగ్, ప్లంబింగ్, శానిటరీ, కంప్యూటర్, ట్యాలీ, అకౌంటింగ్, మహిళలకు కుట్టు మిషన్, ఆభరణాల తయారీ, బ్యూటీ పార్లర్, మగ్గం పనులు, జ్యూట్ బ్యాగుల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తద్వారా గ్రామాలలో, పట్టణాలలో ఉపాధి పొందవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం గోడప్రతులను ఆవిష్కరించారు. జిల్లాలో మైనారిటీ గురుకుల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారులు రమాదేవి, అశోక్, సురేష్, నదీమ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**జైనూర్:** జనగణన 2027 లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి 32 అంశాలపై సమాచారాన్ని స్పష్టంగా సేకరించాలని, ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిక్షకులు అందించే ప్రతి అంశాన్ని నోట్ చేసుకోవాలని, ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 994 మంది ఎన్యుమరేటర్లు, 174 మంది సూపర్వైజర్లు ఇండ్ల గణన కార్యక్రమంలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. 1 వేయి 689 ఇండ్ల జాబితా బ్లాక్ లను గుర్తించడం జరిగిందని, ఇన్నోరేటర్లు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇండ్ల గణన ప్రక్రియను చేపట్టాలని

# గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం



**సిరికొండ:** గ్రామ సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని సభలో సర్పంచ్ బొడ్డు దత్తాత్రి అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సిరికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని అన్నారు. ఈ సందర్భంగా వార్డ్ సభ్యుడు షేక్ ఇమామ్ మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, ఉప సర్పంచ్ తోకల రాజు మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో పాఠశాలలో ఉన్న పాత బోర్ బావిలో కొత్త మోటార్ అమర్చి, పైప్లైన్ ద్వారా 1,2వ వార్డులకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల కేంద్రమైన సిరికొండకు పరిసర గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు వస్తుంటారని, గ్రామంలో సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు సభలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన పాలకవర్గం త్వరలోనే ఈ సమస్యపై చర్చించి శాశ్వత పరిష్కారం చూపుతామని, మహిళల కోసం ప్రత్యేకంగా బాత్రూమ్ సౌకర్యాలు కల్పించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కాస్పే రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, మైనార్టీ చైర్మన్ ఎండి రంజాన్, ముదిరాజ్ సంఘం యువజన జిల్లా అధ్యక్షులు కంచం లక్ష్మణ్, సతీష్, గ్రామ పెద్దలు బత్తుల రామన్న, సూర్యవంశం లక్ష్మణ్, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై ఖాకీ ఉక్కుపాదం

- 16 మండలాల్లో 45 ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- 15 కేసులు నమోదు
- వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్:** అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీల పేరుతో దోపిడీ చేస్తున్న వడ్డీ వ్యాపారులపై ఆదిలాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో గురువారం జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించిన ఆకస్మిక దాడులు అక్రమ వడ్డీ వ్యాపారుల్లో కలకలం రేపాయి. జిల్లా వ్యాప్తంగా అక్రమ వడ్డీ వ్యాపారాలపై నిఘా ఉంచిన పోలీసులు పక్కా ప్రణాళికతో 45 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 16 మండలాల్లో మెరుపు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో దాదాపు వంద మంది అనుమానిత వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, ఖాళీ చెక్కులు, బ్యాంకు పాస్బుక్కులు, ఖాళీ స్టాంప్ పేపర్లు, అలాగే అక్రమంగా రాయించుకున్న సేల్ డీడ్లు, తాకట్టు పెట్టుకున్న వ్యవసాయ భూముల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 7 పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 15 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇచ్చోడ, నేరడిగొండ, తలమడుగు, తాంసి, ఆదిలాబాద్ టూటౌన్, మావల, గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రైతులు, సామాన్య ప్రజలను అధిక వడ్డీలతో పీడిస్తూ వారి భూములను అక్రమంగా రాయించుకునే వడ్డీ వ్యాపారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి రైతుల సాగు భూములను కాజేసే వారి ఆట కట్టించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

# పేదల సొంతింటి కల సాకారం

- లబ్ధిదారులకు సారె బట్టలు పంపిణీ చేసిన సర్పంచ్ దంతెల వినోద్

**, బేల:** పేదల సొంతింటి కల నెరవేరడం అత్యంత సంతోషదాయకమని బేల మండలం భాది గ్రామ సర్పంచ్ దంతెల వినోద్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గారమంలో కొండల సునీత –సంతోష్ నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పంచాయతీ పాలకవర్గం తరఫున లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సారె బట్టలు అందజేశారు. ఒక సామాన్య కుటుంబానికి అండగా నిలిచి, వారి ఇంటి శుభకార్యాన్ని తన సొంత ఇంటి కార్యక్రమంలా భావించి సర్పంచ్ చేసిన ఈ సహాయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. నూతన గృహంలోకి ప్రవేశించిన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ చూపుతున్న ఆదరాభిమానాలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జె.శంకర్, పంచాయతీ కార్యదర్శి మహేష్, వార్డు సభ్యులు షేక్ వాహబ్, జోడే గణేష్, సుంకరి శ్రీనివాస్, పటేల్ మానిక్ రావు, తుడుందెబ్బ అధ్యక్షులు సిడాం నందు, అర్జున్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ‘జనగణన’ పకడ్బందీగా నిర్వహించాలి



జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** జనగణన–2027 ప్రక్రియను జిల్లాలో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ కేంద్రంలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన రెండవ దశ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణనలో భాగంగా నిర్వహించే హౌస్లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ ను ఎలాంటి లోపాలకు తావులేకుండా చేపట్టాలని ఆదేశించారు. ఈసారి జనగణన ప్రక్రియను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ కోసం ‘సెన్సస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్’ వంటి ఆధునిక యాప్లు, పోర్టల్స్ను వినియోగంలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా గణాంకాల్లో ఖచ్చితత్వం పెరుగుతుందని, పొరపాట్లు నివారించవచ్చని అన్నారు. జనగణన నమోదు ప్రక్రియను రెండు విడతల్లో చేపడుతున్నట్లు వివరించారు. ముందుగా ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించగా, అనంతరం మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి గృహాల జాబితాను సేకరిస్తారని చెప్పారు. “జనగణన ద్వారా ప్రజల సంక్షేమం” అనే నినాదంతో ప్రతి పౌరుడి వివరాలు నమోదు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో సిబ్బంది పూర్తి అవగాహనతో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం అధికారులకు జనగణన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై ఉపా చట్టం ప్రయోగిస్తున్న రేవంత్ సర్కార్

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**కాగజ్నగర్:** రాష్ట్రంలో జర్నలిస్టులు, సోషల్ మీడియా ఆక్టివిస్టులపై రేవంత్ సర్కార్ కేసులు నమోదు చేసి అణిచివేతకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన అంతిమయాత్రకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, పెద్ది సుదర్శన్ రెడ్డిలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. తాను కూడా నర్సంపేటకు వెళ్తున్నానేమోనని మా ఇంటికి కూడా పోలీసులు వచ్చారని అన్నారు. ఆర్టీసి కార్మికుడిది ప్రభుత్వ హత్య అని, ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి సమ్మె చేశారని, ఎక్కడా హింసకు పాల్పడలేదన్నారు. అయినా ప్రభుత్వం వారిపై అణిచివేత ధోరణితో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీ సమ్మెను అణిచివేయాలనే కుట్రలో భాగంగానే ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ‘తెలుగు స్కైబ్’ వంటి సోషల్ మీడియా హ్యాండిల్స్పై పెద్ద ఎత్తున కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేసిన వారిపై తీవ్రవాద చట్టమైన ఉపాను ప్రయోగించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. సాధారణంగా తీవ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన వారిపై మాత్రమే ఈ చట్టం ప్రయోగిస్తారని, జర్నలిస్టులపై ఇలాంటి చట్టాలు ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారని, నిజాలు ప్రజలకు తెలియకుండా గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణలో రాజకీయాల కోసం పోలీసులు, ప్రభుత్వ సంస్థలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. జర్నలిస్టులు, సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదైన కేసులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ముత్తోజీపేటలో ఉద్రిక్తత





**వరంగల్:** నర్సంపేట మండలం ముత్తోజీపేటలో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఘటనపై బీజేపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం శంకర్ గౌడ్ భౌతిక కాయంతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అక్కడికి చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో ముత్తోజీపేటకు చేరుకున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను కార్యకర్తలు తొలగించేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తోందని ఆరోపించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. శంకర్ గౌడ్కు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆర్టీసీ కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరు

- సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు చిత్రపటాలకు పాలాభిషేకం



**వరంగల్:** వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి 7 పడకల డయాలసిస్ సెంటర్ మంజూరుకు వైద్య శాఖ మంత్రి దామోదర నరసింహతో మాట్లాడి ఆమోదం పొందేలా చేసినందుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం పట్టణ కాంగ్రెస్ యువనేత పాలకుర్తి శ్రీకాంత్తో కలిసి ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుళ్ళ రవి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. డయాలసిస్ సెంటర్ మంజూరుతో వర్ధన్నపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కీమా నాయక్, తిరుపల్లి కుమారస్వామి, మంచాల రామకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, పులి శ్రీనివాస్ గౌడ్, ఐత సుధాకర్, విలాసారపు వెంకట్, కొండేటి సాంబయ్య, కొండేటి సుధాకర్, నందిపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ లెటర్లు పంపిణీ




**వరంగల్:** పేదలకు సొంత ఇల్లు కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ లెటర్లు పంపిణీ చేశారు. శుక్రవారం హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 255 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా కాజీపేట సోమిడి 62వ డివిజన్లో అర్హులైన లబ్ధిదారులకు కూడా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హన్మకొండ నగర మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ కలిసి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు సొంత ఇల్లు కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు సంక్షేమ పథకాలు అమలవుతూ ప్రతి వర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తోట వెంకన్న, పోతుల శ్రీమన్, అబుబకర్, విజయశ్రీ, మానస రాంప్రసాద్, హన్మకొండ జిల్లా కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ నగర్ జీపీలో గ్రామసభ



**తాండూర్:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు, గ్రామ ప్రజల నుంచి పలు సూచనలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ పరిధిలో పరిష్కరించగల సమస్యలకు నిధులు కేటాయించి పరిష్కారం చేపడతామని తీర్మానించారు. పంచాయతీ పరిధిలో లేని సమస్యలను డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు తాటి పాముల రాము, ఆయిల్ల రాజకుమార్, లింగంపల్లి అభీల, రౌతు భారతి, కస్తూరి రమేష్, చెప్యాల నిరంజన్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, గ్రామ పెద్దలు మామిడాల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## టీల కార్యక్రమంలో రాజకీయ సందడి



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండలంలోని నేరడిగొండ తాండా గ్రామంలో శుక్రవారం నిర్వహించిన టీల కార్యక్రమం రాజకీయ ప్రముఖుల రాకతో సందడిగా మారింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడే జైపాల్, ఆయన సోదరుని కుమారుడు ఆడే మిథున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్, గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఆశీర్వదించి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొంటున్న ఆడే గజేందర్‌తో పాటు, మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే సర్పంచ్ ఆడే శీల హాజరుపై బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి, నాయకులు ఆడే జైపాల్, రమేష్, రాము, విష్ణు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి

### లఖంపూర్ గ్రామంలో గ్రామ సభ



**నేరడిగొండ:** ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని లఖంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి ఎ.సునీల్ కుమార్ పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారం, మురుగు కాలువల శుభ్రత, వీధిదీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామ స్వరాజ్య సాధనకు ముఖ్యమైనదని తెలిపారు. ప్రజల సహకారంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని, లఖంపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం

- డీజీపీ బీ. శివధర్ రెడ్డి
- రుద్రంగిలో నూతన పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన



**సిరిసిల్ల:** రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తామని డీజీపీ బి.శివధర్ రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నిర్మించనున్న నూతన పోలీస్ స్టేషన్ భవనానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మావోయిజం పూర్తిగా అంతమైందని స్పష్టం చేశారు. ప్రజల కేంద్రంగా పోలీసింగ్ వ్యవస్థను తీర్చిదిద్దేందుకు నూతన మార్పులు తీసుకువస్తామని తెలిపారు. పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మరింత సమర్థవంతమైన సేవలు అందించనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ఉపయోగించడం తప్పనిసరని సూచించారు. రోడ్డు ప్రమాదాలతోనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'అరైవ్.. అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, అలాగే భీమారంలో కొత్త పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేములవాడ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసుల సేవలు ప్రజల రక్షణలో కీలకమని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆధునిక పోలీస్ స్టేషన్ ప్రజలకు మెరుగైన భద్రత, సేవలు అందించడంలో కీలకమని తెలిపారు. ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ రుద్రంగి ప్రాంతంలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయి, డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దార్లు, సీఐలు,





# శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**సత్తుపల్లి:** నరసన్నపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె మూడవ రోజు సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో మౌన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి డిపో గేట్ ముందు నర్సన్నపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ అకాల మరణానికి సంతాపం తెలుపుతూ పుష్పగుచ్ఛాలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, 2021, 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన పీఆర్సీ బకాయాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని, ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారానే నడపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆది నారాయణ, మండల కార్యదర్శి తడక మల్లయోబు, ఏఐటీయూసీ నాయకులు నాగేంద్ర, శ్రీను, ప్రసాద్, రామారావు

# రైతుల కోసం పోరాటం మరింత ఉద్ధృతం

- ఖమ్మం కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ మహా రైతు ధర్నా



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా రైతు ధర్నాలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని రైతులకు అండగా నిలిచారు. మొక్కజొన్న, వరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, బోనస్, రుణమాఫీ వంటి పథకాలతో రైతులకు పెద్దఎత్తున అండగా నిలిచామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వరి, మొక్కజొన్న పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులు నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మహా ధర్నాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు





**వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ బి.శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం, చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అవార్డు విజేత సుధీర్ బాబు




**ఆర్మూర్ ఏప్రిల్ 24:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, మెదక్, నిర్మల్, లయన్స్ జిల్లా 320D పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ప్రెసిడెంట్ అవార్డు కు మన ప్రాంతానికి చెందిన ప్రముఖ లయన్స్ సభ్యులు సుధీర్ బాబు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన లయన్స్ జిల్లా కన్వెన్షన్‌లో అంతర్జాతీయ ప్రెసిడెంట్ ఏ.పి.సింగ్ తరపున, పూర్వ అంతర్జాతీయ డైరెక్టర్, లయన్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ జి.బాబు రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏ.అమర్‌నాథ్ రావు, చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. మొత్తం 142 క్లబ్‌లు ఉన్న జిల్లాలో కేవలం ముగ్గురు మాత్రమే ఈ అవార్డుకు ఎంపిక కాగా, ఉమ్మడి జిల్లాలైన కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, నిర్మల్ నుండి ఎంపికైన ఏకైక వ్యక్తిగా సుధీర్ బాబు గుర్తింపు పొందారు. గతంలో వీరు అంతర్జాతీయ ప్రెసిడెంట్ లీడర్‌షిప్ మెడల్ కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ నాయకులు, స్థానిక ప్రముఖులు, బంధు మిత్రులు వారిని అభినందించారు.

## పసుపు రైతులకు సన్మానం




**ఆర్మూర్, ఏప్రిల్ 24:**

నాణ్యమైన పసుపు పంట రైతుకు మంచి ఆదాయం ఇవ్వగలిగే ముఖ్యమైన పంటల్లో ఒకటి పసుపు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఔషధ గుణాలు కలిగి ఉండటం వల్ల మార్కెట్లో ఎప్పుడూ మంచి డిమాండ్ ఉంటుంది. అందువల్ల సరైన పద్ధతుల్లో పసుపు సాగు చేస్తే అధిక దిగుబడితో పాటు మంచి లాభాలు పొందవచ్చు. నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామంలో కార్విన్ అగ్రి సైన్స్ కంపెనీ వారి ఉత్పత్తులు వాడి అధిక దిగుబడులు పొందిన రైతన్నలకు కంపెనీ ప్రతినిధులు దోండి రమణ, శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్విన్ కంపెనీ వారి సాయిల్ పవర్ కిట్ వాడి అధిక దిగుబడులు తీసిన అల్లూరి గంగారెడ్డి, తుమ్మల గంగాధర్ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, నూతపల్లి లింగారెడ్డి, కొప్పుల ముత్యంరెడ్డి, భూక్య సంతోష్, ఏనుగు శంకర్ రెడ్డి, అన్న గారి శ్రీనివాస్, బడల సాయి రెడ్డిలు మాట్లాడుతూ పసుపు నాణ్యత కొమ్మురడం మంచి కురుకుమిన్ శాతం పెరగడం దుంపకుళ్ళు నివారణ తదితర విషయాలపై వాళ్ళ అభిప్రాయాలు పంచు కుంటూ ఇంత మంచి ఉత్పత్తులను అందించిన కార్విన్ కంపెనీ వారికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమం రైతు డిపో కృష్ణవంశీ, అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో నవీన్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు నినాదంతో మేడే నిర్వహించాలి




**ఆర్మూర్, ఏప్రిల్ 24 :**

కార్మికులు పోరాడి సాధించుకున్న మేడే దినోత్సవాన్ని లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్‌తో జరుపుకోవాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, ఉపాధ్యక్షుడు శివాజీ పిలుపునిచ్చారు. మామిడిపల్లిలో శుక్రవారం ఐఎఫ్టియు ఆధ్వర్యంలో మేడే గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వ్యతిరేకమని విమర్శించారు. 12 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్న ప్రయత్నం కార్మిక హక్కులకు విరుద్ధమన్నారు. కార్మికులను రక్షించే విధానాలకంటే పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. వందేళ్ల పోరాటంతో సాధించిన హక్కులను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక కోడ్ల అమలు కార్మికుల జీవన విధానంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడే అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మేడే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు అబ్దుల్, బాలయ్య, లక్ష్మి, భానుచందర్, గంగాధర్, నరేందర్, పటేల్, వర్ణా రెడ్డి, పోచన్న, సాయన్న, రషీద్, చిట్టక్క, ధనలక్ష్మి, సర్వర్ లక్ష్మీ పాల్గొన్నారు.

# కాళేశ్వరం కేసులో హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ పై ఆరోపణలు
- రైతుల పక్షాన పోరాటం ఆపేది లేదు,
- తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే గుణపాఠం తప్పదు
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొనకంటి నర్సయ్య



**భీంగల్, ఏప్రిల్ 24 :**

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎటువంటి అవినీతి జరగలేదని, కేసీఆర్, హరీష్ రావుపై చర్యలు అవసరం లేదని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టులాంటిదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. భీంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య మాట్లాడారు. గత రెండున్నరేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఈ తీర్పు పూర్తిగా ఖండించిందన్నారు. ఈ నిర్ణయంతో తెలంగాణ ప్రజలకు, రైతులకు నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ప్రాజెక్టుకు సుమారు రూ.94 వేల కోట్లు ఖర్చయిందని, లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం కాంగ్రెస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదని, మూడు బ్యారేజీలు, 16 రిజర్వాయర్లు, 21 పంప్ హౌజ్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 203 కి.మీ సొరంగాలు, 98 కి.మీ ప్రెజర్ మెయిన్స్, 1531 కి.మీ గ్రావిటీ కాలువలు, వేల కిలోమీటర్ల పిల్లకాలువలతో నిర్మించబడిందని వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రివర్స్ పంపింగ్ (SRSP పునరుజ్జీవం) వల్లే ఇటీవల నీటి సరఫరా నిలిచిపోయిన సమయంలో బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడగలిగామని తెలిపారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో రైతులకు నీరు అందించగలిగామని చెప్పారు. రివర్స్ పంపింగ్ లేకుంటే వరద కాలువలకు నీళ్లు ఎక్కడి నుంచి వచ్చేవని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. కాళేశ్వరం నీటితో కప్పల వాగులు నిండటంతో భీంగల్ పట్టణంలో త్రాగునీరు, సాగునీటికి కొదవ లేకుండా ఉందన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును నిరుపయోగం చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద కొద్ది పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నప్పటికీ వాటిని మరమ్మతు చేయకుండా రాజకీయ లబ్ధి కోసం ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కోర్టు తిరస్కరించడంతో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైందన్నారు. ఈ తీర్పును తెలంగాణ రైతాంగ విజయంగా స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు మానుకుని ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ చౌటుపల్లి రవి, మాజీ రైతు బంధు అధ్యక్షులు శర్మ నాయక్, మాజీ జిల్లా కోఆప్షన్ మోయిజ్, మాణిక్యాల శ్రీనివాస్,మూడేడ్ల ప్రకాష్, కౌన్సిలర్లు మల్లెల ప్రసాద్,బోదిరే నర్సయ్య, గున్నాల భగత్,నీలం రవి,నాయకులు తోట శంకర్,సతీష్ గౌడ్, పర్సనవీన్,పతాని లిం బాద్రి, ఎమ్మె సుర్జిల్, బచ్చగొని శ్రీనివాస్, రాజు నాయక్, డిష్ గంగాధర్,లింగం నాయక్, మూత లింబాద్రి, ఎస్పీ ప్రవీణ్,సిద్ధపల్లి రాములు,రాగుల అశోక్, మల్లెల శ్రీకాంత్,తోగిటి అరుణ్,గట్టు రతన్ రాజ్, కైత సాగర్,బోట్ల రామకృష్ణ,లడ్డు,పత్రి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 :**




ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వామపక్ష పార్టీలు హెచ్చరించాయి. ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదని విమర్శించారు. రెండేళ్లు గడిచినా విలీనంపై స్పష్టత లేకపోవడం కార్మికుల్లో అసంతృప్తి కలిగిస్తోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించడం లేదని, కొత్త వేతన సవరణను అమలు చేయడంలో ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న బ్యాటరీ బస్సులను ప్రైవేట్ రంగానికి అప్పగించకుండా ప్రభుత్వం స్వయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు వామపక్ష పార్టీల పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని కార్మిక నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు శ్రీనివాస్, సంజీవ్, వామపక్ష పార్టీల నాయకులు వై.ఓమయ్య, రమేష్‌బాబు, వెంకటరాములు, పాపయ్య, వరదయ్య, నరేందర్, సుధాకర్, వెంకట్, రాములు, అనిల్, హుస్సేన్, నర్సింలు, రఘురాం, ఫిరోజ్ అలీ, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

## కాంతి హైస్కూల్లో అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం



**ఆర్మూర్, ఏప్రిల్ 24 :**

పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్లో శుక్రవారం అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ వివిధ విభాగాల్లో పురస్కారాలు అందజేశారు. అకాడమిక్ ఇంప్రూవ్‌మెంట్, బెస్ట్ హ్యాండ్‌రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డిసిప్లిన్ స్టార్, ఆర్ట్స్, మోస్ట్ ప్రొడక్టివ్, క్రియేటివ్ థింకర్స్, అటెండెన్స్ వంటి విభాగాల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ కాంతి గంగారెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి సంవత్సరం జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని, వారి లక్ష్య సాధనకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారని వెల్లడించారు. పాఠశాల డైరెక్టర్ వేల్పూర్ శశాంక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఐఐటి, అబాకస్, వేదిక్ మ్యాథ్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు జీవన్ రెడ్డి మద్దతు



**ఆర్మూర్, ఏప్రిల్ 24 :**

గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు శుక్రవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ముందు ఉన్న శిబిరంకి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, సమ్మెలో ఉన్న ఆర్టీసీ కార్మికులందరికీ సంఘీభావం తెలుపుతూ వారికి మద్దతుగా కూర్చున్నారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకుని చనిపోవడం వారి ఆత్మకు శాంతి కలగాలని శిబిరంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుని ఖండించారు. అలాగే ఈ సమ్మెకు పూర్తి మద్దతు బిఆర్ఎస్ పార్టీ ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, యూనియన్ లీడర్స్ చక్రవర్తి, రవి, అశోక్, టిఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ పట్టణ శాఖ అధ్యక్షులు పూజా నరేందర్, కౌన్సిలర్లు పృథ్వి, అజీమ్, నయీమ్, సీనియర్ నాయకులు సుంకర రవి, పోల సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు సెంట్ ఫాల్ బబ్లు, ఈగ గంగాధర్, సురేష్, హగ్గు క్రాంతి, మీరా శ్రావణ్, గిరీష్, శ్రీకర్, బోడమీద నరసయ్య, కళ్యాణ్, కాపల్లి గణేష్, హర్షత్, రమేష్, ప్రవీణ్ గౌడ్, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి



**ఆర్మూర్, ఏప్రిల్ 24:**

ఆర్మూర్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన భేటీలో ఆర్మూర్ పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో సిబ్బంది కొరతను ప్రస్తావిస్తూ పూర్తి స్థాయి డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని కోరారు. నందిపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాయాపూర్ గ్రామ పీహెచ్‌సీకి పూర్తి స్థాయి సిబ్బంది నియామకం చేయడంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సిలిండర్ లింగం, సర్పంచులు లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, సాయి కుమార్, దేవేందర్, దేవదాసు, ముత్యం, నవీన్, మహమూద్, హనుమాన్, సుదన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24 :**



మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఆస్తి పన్ను మినహాయింపు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల కేటాయింపు వంటి అంశాలు త్వరగా అమలు కావడం లేదని ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆస్తిపన్ను విషయంలో మున్సిపల్ అధికారులతో చర్చిస్తానన్నారు. ఇదిలా ఉండగా, తమతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిన మొదటి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తేనని సంఘం జిల్లా అధ్యక్షుడు సూర హర ప్రసాద్ తెలిపారు. తమ సమస్యలను శ్రద్ధగా విన్నారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్, సహాయ కార్యదర్శి రూపేష్ కుమార్, సలహాదారులు మోహన్, కోశాధికారి థామస్ పాల్గొన్నారు.

# సాహితీ దిగ్గజం తిరునగరి

## నేడు తిరునగరి రామానుజయ్య వర్ధంతి

(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)



అభినవ మహాకవి, భారతి భాష భూషణ్ దాశరథి కృష్ణమాచార్య పురస్కార గ్రహీత డాక్టర్ తిరునగరి ఈ లోకాన్ని వదిలి ఏడాది అయ్యింది. తిరునగరి రామానుజయ్య (సెప్టెంబరు 2ీ, 19ీ5 – ఏప్రిల్ 25, 2021) తెలంగాణ రాష్ట్రంకు చెందిన సాహితీవేత్త, పద్యకవి. పద్యం, గేయం, వచన ప్రక్రియలలో సాహిత్య కృషి చేశారు. పద్యకవి, వచనకవితా కవి, కవిత్వ విమర్శకుడు తిరునగరి. తిరునగరి యాదాద్రి జిల్లా రాజపేట మండలంలోని బేగంపేట గ్రామంలో శ్రీమతి జానకిరామక్క, మనోహర్ దంపతులకు 19ీ5 సెప్టెంబర్ 2ీన జన్మించారు. కవిత్వమే శ్వాసగా జీవించే కవిత్వోపాసకులు ఆయన. మానవత్వం తన కవిత్వ వస్తువుగా, మానవ వేదనలను కవిత్వీకరించటంలో ఆయన ఘనాపాటి.

**టి. అసాధారణ ధారణాశక్తితో ఎందరో రచనలను ఉదాహ రిస్తూ, ఆశువుగా పద్యాలు చెప్తూ తాను చేసే సాహిత్యో పన్యాసాలు చేయడంలో తనకు తానే సాటి. సహజ, సరళ శైలిలో రాయడంలో దిట్ట. కవిత్వ రచన, విమర్శనం, వ్యాఖ్యానాలు ఆయనకు కరతలామలకాలు. మూడు దశాబ్దాలపాటు తెలుగు భాషోపాధ్యాయుడుగా, తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసిన తిరునగరి వేలాదిమంది శిష్యులకు వందనేయులు, ఆరాధ్యులు. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల త్రి భాషల్లో పట్టు సాధించి, ప్రాచ్య, పాశ్చాత్య కవిత్వ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని, గత ఐదు దశాబ్దాల నుంచి నిరంతర సాహిత్య సేవకు అంకితమైన సాహితీవేత్త.**

ఆయన సాహిత్య వ్యాసాలు వెయ్యికి దాటే వుంటాయి. గొప్ప గేయ రచయిత కూడా. తిరునగరి వందలాది లలిత, దేశభక్తి, ప్రబోధాత్మక గేయాలు రచించారు. వందలకొద్ది సాహిత్య సదస్సులలో, కవి సమ్మేళనాలలో ప్రధానవక్తగా పాల్గొన్నారు. అనితర సాధ్యమైన ప్రసంగాలు చేసారు.

హైదరాబాదులోని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల నుండి దాదాపు 100 లలిత, దేశభక్తి గీతాలు, కవితలు, ప్రసంగాలు ప్రసారమయ్యాయి. ప్రైవేట్ ఆల్బమ్స్ కు భక్తి గీతాలు, ప్రబోధగీతాలు రాశారు. అయన వరంగల్ వాణి, ఆంధ్రపత్రికకు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేశారు. ఆంగ్లం, హిందీ నుండి కవితలు, వ్యాసాలు అనువాదం చేశారు. తిరునగరి జీవితం – సాహిత్యం అన్న అంశాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖలో పరిశోధనలు జరిగాయి. పాతికకు పైగా ప్రభుత్వ, ప్రభుత్వేతర పురస్కారాలు ఆయన అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యిచ్చే దాశరథి పురస్కారం–2020 గ్రహీత ఆయన.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆం.ప్ర. ప్రభుత్వ సత్కారం (1975), నల్లగొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యా యుడుగా సత్కారం (1976,1978), యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పండిత సత్కారం (1992), బి.ఎన్.రెడ్డి సాహిత్య పురస్కారం (199ీ), ఆం.ప్ర. ప్రభుత్వ కళానీరాజన పురస్కారం (1995), ఆం.ప్ర. ప్రభుత్వ విశిష్ట (ఉగాది) పురస్కారం (2001), విశ్వసాహితి' ఉత్తమ పద్యకవి పురస్కారం (2003), భారత్ భాష భూషణ్ (డాక్టరేట్) అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళనం భోపాల్, మధ్యప్రదేశ్ (2003), ఆటా (అమెరికా తెలుగు అసోసియేషన్) సత్యారం (2006), ఆం.ప్ర. ప్రభుత్వ అధికార భాషా సంఘం సత్కారం (2006), రాచమళ్ళ లచ్చుమ్మ స్మారక 'మాతృమూర్తి' అవార్డు, నల్గొండ (2008), ప్రతిభా పురస్కారం 2012 – తెలుగు విశ్వవిద్యాలయం, 201ీ, వేదా చంద్రయ్య తెలంగాణ రాష్ట్ర స్థాయి పురస్కారం (2015), పద్మశ్రీ ఎస్.టి. జ్ఞానానందకవి సాహిత్య పురస్కారం (2016), శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం దాశరథి పురస్కారం (2017), గిడుగు తెలుగు భాషా పురస్కారం (2017), సారిపల్లి కొండలరావు, యువకళా వాహిని సాహిత్య పురస్కారం (2019), ఆరాధన సాహిత్య పురస్కారం (2019), అభినందన సినారె సాహిత్య పురస్కారం (2019), డా. దాశరథి వంశీ జీవిత సాఫల్య సాహితీ పురస్కారం (2019), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దాశరథి సాహితీ పురస్కారం – 2020, ఆగస్టు 15న ప్రగతి భవన్ లో సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా, ఇలా ఎన్నో పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు.

ఔద్యోగిక సమయంలో యాదాద్రి జిల్లా ఆలేరులో నివాస మేర్పరచు కున్నారు. ప్రస్తుతం చింతల్(హెచ్ ఎం టి)లోని గణేశ్ నగర్ లో విశ్రాంత జీవితాన్ని గడుపుతుండే వారు. 2021 ఏప్రిల్ 25న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

# వాసవి మాత జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

## మున్సిపల్ వైస్ చైర్మన్, పోలీస్ అధికారులను కలిసిన ఆర్యవైశ్య సంఘం నేతలు

**నిర్మల్, ఏప్రిల్24 :** నిర్మల్ పట్టణంలో వైభవంగా నిర్వహించనున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్ గుప్త ఆధ్వర్యంలో సంఘ సభ్యులు పలువురు ప్రముఖులను కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు. ఉత్సవాల ఆహ్వానంలో భాగంగా నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అప్పాల గణేష్, జిల్లా అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, మరియు పట్టణ సీఐ సమ్మయ్యలను ఆర్యవైశ్య ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి అమ్మవారి జయంతి ఉత్సవ పత్రికలను అందజేసి, జరగబోయే ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. ఈ వేడుకలను పట్టణ ప్రజలందరి సహకారంతో వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గంప అనిల్, కోశాధికారి పోలిశెట్టి శైలేష్‌తో పాటు ప్రముఖులు లింగంపల్లి లక్ష్మీనారాయణ, పాల్దే మహేందర్, చిన్నవార్ పూర్ణేందర్, పడిగేల శివ, వావిలాల మారుతి, గందే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# అమెరికా కల.. అనిశ్చిత గమ్యం

## ట్రంప్ 'ముళ్ల' బాటలో భారతీయ మేధావులు

## మేధో వలస నుంచి 'రివర్స్ మైగ్రేషన్' వైపు.. స్వదేశీ స్థిరత్వంపైనే యువత మొగ్గు

## ఖరీదైన చదువులు.. కఠిన వీసా నిబంధనలు.. మారుతున్న ఖండాంతర ముఖచిత్రం

**డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించడంతో 'అమెరికా కల' ముఖచిత్రం వేగంగా మారుతోంది. ఒకప్పుడు అవకాశాల గనిగా భావించిన అగ్రరాజ్యం, ఇప్పుడు అనిశ్చితికి నిలయంగా కనిపిస్తోంది. "అమెరికా ఫస్ట్" నినాదంతో ట్రంప్ అవలంబిస్తున్న కఠిన వలస విధానాలు ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు, విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.**



### వీసా 'వేతన' గండం

భారతీయ నిపుణులకు వెన్నెముక వంటి హెచ్–1బి (ఎ–1దీ) వీసా నిబంధనలను ట్రంప్ సర్కార్ మరింత క్లిష్టతరం చేసింది. కనీస వేతన పరిమితిని గణనీయంగా పెంచడం వల్ల అమెరికన్ కంపెనీలు భారతీ–యులను నియమించుకోవడానికి వెనుకాడుతున్నాయి. ఏటా జారీ చేసే వీసాల్లో 70 శాతం భారతీయులకే దక్కినా, ఇప్పుడు పెరిగిన వేతన భారం, అదనపు పత్రాల సేకరణ (=ఖీజు) వంటి అంశాలు ఉద్యోగుల్లో మానసిక ఆందోళనను పెంచుతున్నాయి. మరోవైపు, దశాబ్దాలుగా గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది భారతీయుల వ్యధ వర్ణనాతీతం. 21 ఏళ్లు దాటిన పిల్లలు 'డిపెండెంట్' హోదా కోల్పోయి తిరిగి స్వదేశానికి రావాల్సి రావడం కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది.

### భారంగా మారిన విదేశీ విద్య

ఒకప్పుడు మధ్యతరగతి కలగా ఉన్న అమెరికా చదువు ఇప్పుడు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. మాస్టర్స్ డిగ్రీ కోసం ఏడాదికి 60,000 నుంచి 90,000 డాలర్ల వరకు ఖర్చవుతుండటం, రూపాయి విలువ పతనం కావడం భారతీయ కుటుంబాలపై పెను భారాన్ని మోపుతున్నాయి. దీనికి తోడు పెరిగిన జీవన వ్యయం, ఇళ్ల అద్దెలు ఐటీ నిపుణుల పొదుపును హరిస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్లే చాలామంది ఇప్పుడు కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి ప్రత్యామ్నాయ దేశాల వైపు చూస్తున్నారు.

### స్వదేశం వైపు చూపు - రివర్స్ మైగ్రేషన్:

ప్రస్తుత తరుణంలో గమనించాల్సిన ప్రధాన అంశం 'తిరుగు వలసలు'. భారతదేశంలో మౌలిక సదుపాయాల కల్పన, స్టార్టప్ సంస్కృతి ఊపందుకోవడంతో హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను కల్పిస్తున్నాయి. అమెరికాలో పెరుగుతున్న జాతి వివక్ష, తుపాకీ సంస్కృతి వంటి భద్రతాపరమైన అంశాలు కూడా భారతీయులను స్వదేశం వైపు ఆలోచింపజేస్తున్నాయి. సొంత గడ్డపై కుటుంబ సభ్యుల మధ్య ఉంటూ గౌరవప్రదమైన వేతనాలతో స్థిరపడటమే మేలనే అభిప్రాయం య–ువతలో బలపడుతోంది.

### ముగింపు

అమెరికా తన వలస విధానాలను పునఃసమీక్షించుకోకపోతే ప్రపంచవ్యాప్త మేధస్సును కోల్పోయే ప్రమాదం ఉంది. మేధో సంపత్తి ఏ దేశానికైనా అసలైన ఆస్తి. భారతీయ నిపుణులు కూడా ఇప్పుడు కేవలం భావోద్వేగాలతో కాకుండా, భవిష్యత్తు భద్రత మరియు ఆర్థిక స్థిరత్వాన్ని బేరీజు వేసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అనిశ్చితి ఉన్నచోట అవకాశాల కోసం వెతకడం కంటే, స్థిరత్వం ఉన్నచోట భవిష్యత్తును నిర్మించుకోవడమే ప్రస్తుత తరుణంలో సరైన వ్యూహం.

# మూగబోయిన ధర్మపురి గాంధర్వం

## గుండి శంకర్ నిష్క్రమణతో ముగిసిన సంగీత శకం

### శేషప్ప పద్యాలకు ప్రాణం పోసిన స్వర యోధుడు.. అపర ఘంటసాల ఇక స్మృతి కావ్యం

### సంగీతమే శ్వాసగా, సాహిత్యమే ధ్యేయంగా సాగిన ఒక అరుదైన జీవన యజ్ఞం



పవిత్ర గోదావరి తీరాన నరసింహ నామస్మరణతో పాటు ప్రతిధ్వనించే ఆ కమ్మని గొంతు ఇక వినబడదు. ధర్మపురి క్షేత్ర సాంస్కృతిక వైభవాన్ని తన గాత్రంతో దేశవ్యాప్తం చేసిన 'గాన గంధర్వ' గుండి శంకర్ సార్ భౌతిక నిష్క్రమణ ఆ క్షేత్ర చరిత్రలో ఒక తీరని శూన్యం. ఆయన మరణం కేవలం ఒక వ్యక్తి నిష్క్రమణ కాదు; అది ఒక సంగీత శకం ముగింపు, ఒక చైతన్య రథం ఆగిపోవడం.

### సంప్రదాయ సంగీతానికి నిలువుటద్దం:

ఒక సాదాసీదా ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించిన శంకర్ సార్, సంగీతాన్ని కేవలం వినోదంగా కాకుండా భగవంతుడిని చేరుకునే ఆధ్యాత్మిక సోపానంగా మలచుకున్నారు. కటిక పేదరికం, అనారోగ్య సమస్యలు ఎన్ని ఎదురైనా తన గాత్ర సాధనను ఆయన వీడలేదు. నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గారి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం, రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీల్లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. అందుకే ధర్మపురిలో "పాట అంటే శంకర్ సార్.. శంకర్ సార్ అంటే పాట" అనే నానుడి స్థిరపడిపోయింది.

### సాహిత్య సేవలో అగ్రగణ్యుడు:

ధర్మపురి భక్త కవి శేషప్ప రాసిన 'నరసింహ శతకాన్ని' సామాన్య ప్రజానీకానికి చేరవేయడంలో ఆయన పాత్ర అనన్యసామాన్యం. గుండి జగదీశ్వర్ శర్మ గారితో కలిసి ఆయన ఆలపించిన పద్యాలు భక్తి సాహిత్యానికి నూతన జవజీవాలు పోశాయి. స్పష్టమైన ఉచ్చారణతో, రాగయుక్తంగా ఆయన పద్యం చదువుతుంటే శ్రోతలు పరవశించిపోయేవారు. పద్య కళకు పూర్వ వైభవాన్ని తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది.

### ఆదర్శ ఉపాధ్యాయుడిగా, మార్గదర్శిగా:

నేరేళ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన కేవలం పాఠాలు మాత్రమే కాదు, క్రమశిక్షణతో కూడిన జీవన విద్యను నేర్పారు. పౌరాణిక నాటక రంగంలో నటులకు లయ తప్పకుండా పద్యాలు నేర్పడంలో ఆయనది అందెవేసిన చేయి. తోటి కళాకారుల ఎదుగుదలను చూసి మురిసిపోయే గొప్ప సంస్కారం ఆయన సొంతం. తన చివరి శ్వాస వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని (వాట్సాప్ వంటివి) సైతం దైవ చింతనకే వినియోగిస్తూ ప్రతి ఇంటినీ ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.

**నేడు ఆ ధర్మపురి కంఠం మూగబోయినా, ఆయన పంచిన సరీ త సుధలు, ఆయన తీర్చిదిద్దిన శిష్య పరంపర ద్వారా గుండి శంకర్ సార్ ఎప్పటికీ సజీవంగానే ఉంటారు. అపర ఘంటసాలగా, గాన గంధర్వుడిగా ఆయన పేరు ధర్మపురి గాలిలో, నేలలో, మనుషుల గుండెల్లో శాశ్వతంగా లిఖించబడింది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# పాత్రికేయ కురువృద్ధులు నందూరి

**నేడు నందూరి రామమోహనరావు జయంతి**

తెలుగు పత్రికలతో పరిచయం ఉన్న వారికి నందూరి రామమోహనరావు పేరు సుపరిచితమే. అయన సమాజం పట్ల నిబద్ధత కలిగిన సంపాదకులు. ఆయన ఎంతో మందికి గురు తుల్యులు, మార్గ నిర్దేశకులు. మరెంతో మందిని పాత్రికేయులుగా తీర్చి దిద్దిన గురువులు. పాత్రికేయునిగానే కాక, రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు. పత్రికారంగంలో అంతటి సంగీత సాహిత్య కళా మర్మాలెరిగిన వ్యక్తి చాలా అరుదు.

**నందూరి రామమోహనరావు (ఏప్రిల్ 24, 1927- సెప్టెంబర్ 3, 2011) తెలుగు పాత్రికేయరంగ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేధావి. చాలాకాలం ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహించారు. "బాల" అనే పత్రికలో, ఆంధ్రపత్రిక లోనూ 1940 వ దశకంలో అయన రచనలు ఎన్నో ప్రచురింప బడ్డాయి. "నరావతారం", "విశ్వరూపం" ఈయన ప్రముఖ రచనలు. సామాన్య జనాలకు సైన్సు విషయాలను పరిచయం చేయడంలో నందూరి కృషి మరవ లేనిది. అయన ఆంధ్రపత్రికలో మార్క్ ట్వేయిన్ నవలలకు తెలుగు అనువాదాలు కూడా చేసారు. దశాబ్దాల క్రితం నందూరి ఆంధ్రవార పత్రికలో పిల్లల కోసం రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ కాంచన ద్వీపం, మార్క్ ట్వేన్ టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్, రాజూ పేద, విచిత్రవ్యక్తి అనువాద రచనలు ఆకట్టు కునేవి. అనువాదం కూడా మరో భాష నుంచి అనువాదాన్ని చేసినట్లు కాకుండా తెలుగులో అచ్చు స్వీయ రచనలానే వుండేది.**

ఆంధ్రపత్రిక ద్వారా ఆయన జర్నలిస్టు జీవితం ప్రారంభించి, 1948 నుంచి 1960 వరకు ఆయన ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1960లో సహ సంపాదకులుగా 'ఆంధ్రజ్యోతి'లో కాలూనారు. 1960 నుంచి 1994 దాకా...దాదాపు మూడున్నర దశాబ్దలు ఆయన 'ఆంధ్రజ్యోతి'లో రచనా జైత్ర యాత్ర కొన సాగించారు. ఆయన సంపాదకీయ రచనా వైశిష్ట్యం పాఠకులపై చాలా ప్రభావం చూపేది. తొలినాళ్లలో సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావుతో కలసి పని చేశారు. నార్ల తర్వాత 1980 లో నందూరి 'ఆంధ్రజ్యోతి' సంపాదకులుగా పూర్తిస్థాయి బాధ్యతలు భుజ స్కందాలపై వేసు కున్నారు. ఆయన 1962, 1978, 1984, 1992 లలో అమెరికాలో, 1982లో రష్యా లోను పర్యటించారు.

ఆరు దశాబ్దాల కాలం గడిచినా, నందూరి నాటి పుస్తకాలకు ఆదరణ తగ్గక పోవడం విశేషం. నందూరి ఖగోళ, భౌతిక శాస్త్రాలను పరిశోధించి 'విశ్వరూపం' అనే పుస్తకం రచించారు. మానవాళి పరిణామ క్రమానికి సంబంధించిన నరావతారం, తత్త్వశాస్త్రాన్ని సులువుగా వివరించే 'విశ్వ దర్శనం' ఆయన కలం నుంచి జాలువారినవే. నందూరి.. సవ్యసాచి పేరుతో రాజకీయ వ్యంగ్య రచనలు, హరివిల్లు పేరుతో బాల గేయాలు, ఉషస్విని పేరిట కవితలు రచించారు.

మిత్రలాభం, మిత్ర భేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నందూరి మాటలను అందించారు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మతో కలిసి 'మహా సంకల్పం' అనే సంకలనాన్ని వెలువరించారు. సంపాదకీయాల సంకలనం అను పల్లవి, చిరంజీవులు, వ్యాఖ్యావళి తదితరాలు ఆయన కలం నుండి జాలువారిన రచనలే. నందూరి రాసిన ఐదు పుస్తకాలను న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ అధినేత బాబ్జీ ప్రచురించి 2006 మే 9వ తేదీన ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించి, ఆయనను సత్కరించారు.

ఆంధ్రపత్రికలో పని చేసే రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, తెన్నేటి సూరి, పిలకాగణపతిశాస్త్రి వంటి దిగ్గజాలతో సాహిత్యంపై చర్చించేవారు. అలాగే ఆరుద్ర, శ్రీశ్రీ లతోపాటు 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు రామచంద్రమూర్తి, తదితలతో నందూరికి సంబంధం, అనుబంధం ఉండేది.

**నరావతారం, విశ్వరూపం, విశ్వదర్శనం - భారతీయ చింతన విశ్వదర్శనం - పాశ్చాత్య చింతన అనుపల్లవి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) చిరంజీవులు (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), వ్యాసావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), అక్షరయాత్ర (సాహిత్య, సాహిత్యేతర వ్యాస సప్తతి), ఉషస్విని (కవితా సంపుటి), చిలక చెప్పిన రహస్యం (పిల్లల నవల), మయూర కన్య (పిల్లల నవల), హరివిల్లు (పిల్లల గేయాలు) వంటి రచనలు చేసారు.**

అభినందన (హైదరాబాదు) సంస్థ నుంచి ముట్నూరి కృష్ణారావు అవార్డు (1988), జూలూరి నాగ రాజారావు (హైదరాబాదు) స్మారక అవార్డు (1989), మద్రాసు తెలుగు అకాడెమీ "ఉగాది వెలుగు" అవార్డు (1989), కళాసాగర్ (మద్రాసు) అవార్డు, అభిరుచి (ఒంగోలు) సంస్థ వారి "పాత్రికేయ రత్న" అవార్డు, "జమీన్ రైతు" వజ్రోత్సవంలో నెల్లూరి వెంకట్రామా నాయుడు స్మారక అవార్డు (1990), ఆలూరి నారాయణరావు స్మారక ట్రస్టు (విజయవాడ) వారి సి.వై.చింతామణి అవార్డు, తెలుగు యూనివర్సిటీ వారి ఆనరరీ డాక్టరేట్ (1991), అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి "శిరోమణి" అవార్డు (1992), క్రాంతి విద్యా సంస్థల (విజయవాడ) నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1994), రామకృష్ణ జైదయాళ్ హార్మోనీ అవార్డు (1994), సిద్ధార్థ కళా పీఠం (విజయవాడ) వారి విశిష్ట వ్యక్తి అవార్డు (1994), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1996), తెలుగు యూనివర్సిటీ వారి తాపీ ధర్మారావు స్మారక అవార్డు (1997), అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు (1998), తదితర అవార్డులు అందుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494




# మానవ సేవే మాధవ సేవ

**సత్య సాయి 'ప్రేమ పథం' ప్రపంచానికే మార్గదర్శకం!**

**నేడు సత్య సాయిబాబా ఆరాధన మహోత్సవం..**

**పుట్టపర్తి నుంచి విశ్వవ్యాప్తమైన ఆధ్యాత్మిక వెలుగులు**



సత్య సాయిబాబా (నవంబరు 23, 1926 – ఏప్రిల్ 24, 2011) భారతదేశం లోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక గురువు. ఆయన తన జీవిత కాలంలో లక్షలాది మంది భక్తులను ఆకర్షించారు. ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలను బోధించి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.

**శ్రీ సత్య సాయిబాబా 1926 నవంబర్ 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుట్టపర్తి అనే చిన్న గ్రామంలో జన్మించారు. బాల్యంలో ఆయన అసాధారణమైన ఆధ్యాత్మిక సామర్థ్యాలు ప్రదర్శించారు. అనేక భక్తులు ఆయనలో శక్తి ఉందని భావించారు. 14 సంవత్సరాల వయసులో సత్య సాయిబాబా, తాను శిర్డీ సాయిబాబా పునర్జన్మ అని ప్రకటించి, భక్తుల జీవితాలను మారుస్తూ ఆధ్యాత్మిక గురువుగా మారారు.**

సత్య సాయిబాబా బోధనల హృదయం ప్రేమ, మానవత్వం, సమానత్వం వంటి విలువల చుట్టూనే తిరుగుతుంది. ఆయన 5 సూత్రాలు సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా సూచించారు.

**జీవితంలో నిజాయితీ, సత్యవంతత ముఖ్యమైన ఆధ్యాత్మిక గుణాలని ఆయన బోధించారు. కర్తవ్యాలను నిబద్ధతతో నిర్వహించడం, సమాజం పట్ల న్యాయంగా వ్యవహరించడం అవసరం అని అన్నారు.అంతర్గత ప్రశాంతతను సాధించడం ద్వారా మనిషి నిజమైన ఆనందాన్ని పొందగలడని ఆయన వివరించారు. పాత మతాలు, భిన్నత్వాల కతీతంగా ప్రేమతో జీవించమని సందేశం ఇచ్చారు. ఎలాంటి హింస లేకుండా శాంతియుత జీవితం గడపమని ఆయన కోరారు.**

సత్య సాయిబాబా సేవా మార్గం ప్రపంచానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచింది.సత్య సాయిబాబా అనేక విద్యా సంస్థలను స్థాపించారు, అక్కడ నాణ్యమైన విద్యతో పాటు ఆధ్యాత్మిక విలువల్ని బోధిస్తారు. విద్య వ్యాపారం కాకుండా సేవగా ఉండాలని ఆయన స్పష్టంగా చెప్పారు. ఆయన స్థాపించిన సుపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించ బడతాయి. పేదలకు, బాధితులకు ఉచిత చికిత్స అందించడంలో ఈ ఆసుపత్రులు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. సత్య సాయిబాబా ఎన్నో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు కోట్లాది మందికి మేలు చేకూర్చాయి.

**సత్య సాయిబాబా భక్తుల ముందు అనేక అద్భుతాలను ప్రదర్శించారు. విభూతి (పవిత్ర బూడిద) ను చేయి నుంచి ప్రత్యక్షంగా సృష్టించడం, వస్తువులను క్షణాల్లో ఉత్పత్తి చేయడం వంటి అద్భుతాలు ఆయన భక్తులకు విశ్వాసాన్ని కలిగించాయి. ఈ అద్భుతాలు కొందరి విమర్శలకు గురైనా, భక్తులు వాటిని ఆయన ఆధ్యాత్మిక శక్తులుగా భావించారు.**

ఆయన బోధనల ద్వారా అనేక మంది జీవిత విధానంలో మార్పు తీసుకువచ్చి సమాజ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఆయన బోధించిన నైతిక విలువలను తమ రోజువారీ జీవితాల్లో ఆచరిస్తున్నారు. సత్య సాయిబాబా స్థాపించిన సత్య సాయిబాబా ఆర్గనైజేషన్ 100 కంటే ఎక్కువ దేశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థలు విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా వంటి రంగాల్లో ముఖ్యమైన సేవలు అందిస్తున్నాయి.

**సత్య సాయిబాబా బోధనలు అన్ని మతాలకు ఒకే తీరున ప్రామాణికతను చూపాయి. ఆయన సందేశం అన్ని మతాల ప్రాథమిక విలువలను అనుసరిస్తూ, మతసామరస్యం మరియు సమానత్వం గురించి చర్చించేది. సత్య సాయిబాబా తన జీవితకాలంలో పలు విమర్శలను ఎదుర్కొన్నారు. ఆయన చేసే అద్భుతాలను కొందరు మాయా జాలంగా అభివర్ణించారు. ఆయనకు వ్యతిరేకంగా కొన్ని ఆర్థిక అక్రమాల ఆరోపణలు కూడా వచ్చాయి. అయితే, ఆయన భక్తులు ఈ విమర్శలను తోసిపుచ్చి, ఆయనను భగవంతుని అవతారంగా భావిస్తూ తమ విశ్వాసాన్ని కొనసాగించారు. విమర్శలు ఆయన ఆధ్యాత్మిక ప్రభావాన్ని తగ్గించలేక పోయాయి.**

2011 ఏప్రిల్ 24న సత్య సాయిబాబా తన భౌతిక దేహాన్ని విడిచారు. ఆయన మరణం భక్తులకు చాలా బాధాకరమైన విషయం. అయితే, ఆయన స్థాపించిన సంస్థలు, ఆశయాలు మరియు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.సత్య సాయిబాబా జన్మస్థలం పుట్టపర్తి, ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. సాయిబాబా సమాధి దగ్గర అనేక భక్తులు ప్రతిరోజూ ప్రార్థనలు చేస్తూ ఆయన బోధనలను గుర్తు చేసుకుంటారు.విద్యా మరియు ఆరోగ్య సేవలుఆయన మరణం తర్వాత కూడా ఆయన స్థాపించిన విద్యా, ఆరోగ్య సేవా సంస్థలు ప్రతిభావంతమైన విద్యార్థులకు విద్యను, పేదలకు వైద్య సేవలను అందిస్తున్నాయి.

**"మానవ సేవే దేవ సేవ" అన్న ఆయన సందేశం ప్రజల హృదయాల్లో గాఢంగా నిలిచి పోయింది. ఆయన స్థాపించిన సేవా కార్యక్రమాలు ప్రపంచానికి వెలుగునిచ్చే దీపాలుగా కొనసాగుతున్నాయి. సత్య సాయిబాబా జీవితం ఒక ఆదర్శంగా ఉంది. ఆయన చూపించిన మార్గం, బోధనలు ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయి. ఆధ్యాత్మికత, సేవ, ప్రేమ కలిసిన జీవితమే సత్య సాయిబాబా జీవన దర్శనం. ఆయన సేవా భావం మరెన్నో తరాల వరకు మార్గదర్శకంగా నిలుస్తుంది.**



# తెలుగు సినీ చరిత్రలో 'పూర్ణోదయ' ప్రభాతము

**నేడు ఏడిద నాగేశ్వరరావు జయంతి**

తెలుగు సినిమా పేరును ఖండాంతరాలు దాటించి, కళాత్మక చిత్రాలకు కమర్షియల్ విజయాన్ని జోడించిన అరుదైన నిర్మాత ఏడిద నాగేశ్వరరావు. కేవలం తొమ్మిది చిత్రాలు నిర్మించినప్పటికీ, అవన్నీ భారతీయ సినీ చరిత్రలో ఆణిముత్యాలుగా నిలిచిపోయాయంటే ఆయన అభిరుచి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. ఏప్రిల్ 24న ఆయన జయంతి సందర్భంగా, 'పూర్ణోదయ మూవీ క్రియేషన్స్' ద్వారా ఆయన సృష్టించిన అద్భుత దృశ్యకావ్యాలపై ప్రత్యేక విశ్లేషణ.

## నటుడి నుంచి నిర్మాత వరకు..

తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో 1934 ఏప్రిల్ 24న జన్మించిన ఏడిద నాగేశ్వరరావు, పాఠశాల దశలోనే అమ్మాయి వేషధారణతో నటనపై మక్కువ పెంచుకున్నారు. బి.ఎ. చదివే రోజుల్లో దర్శకుడు వి.బి. రాజేంద్రప్రసాద్ పరిచయంతో నాటక రంగంలో రాణించారు. ఆ తర్వాత మద్రాస్ వెళ్లి డబ్బింగ్ కళాకారుడిగా, సుమారు 30 సినిమాల్లో నటుడిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 1978లో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'సిరిసిరి మువ్వ' చిత్రానికి నిర్మాణ సారథ్యం వహించి నిర్మాతగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.

## శంకరాభరణం: ఒక చరిత్ర.. ఒక విప్లవం!



తెలుగు సినిమా గతిని మార్చిన చిత్రం 'శంకరాభరణం'. కేవలం 11 లక్షల రూపాయలతో 52 రోజుల్లో నిర్మించిన ఈ సినిమా, జాతీయ స్థాయిలో స్వర్ణ కమలాన్ని సాధించడమే కాకుండా, విదేశీ గడ్డపై కూడా తెలుగు జయకేతనం ఎగురవేసింది. అమెరికాలో ఈ చిత్రం కోసం 'శంకరాభరణం నైట్స్' నిర్వహించడం అప్పట్లో ఒక సంచలనం. ఎర్నాకులంలో రెండేళ్లు ఆడి మలయాళ చిత్ర పరిశ్రమను సైతం ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత వచ్చిన సాగర సంగమం, సీతాకోక చిలుక, స్వాతిముత్యం, సితార వంటి చిత్రాలు జాతీయ అవార్డుల పంట పండించాయి.

## ఆస్కార్ వరకు చేరిన ప్రయాణం

ఏడిద నిర్మించిన 'స్వాతిముత్యం' చిత్రం భారత ప్రభుత్వం తరపున అధికారికంగా ఆస్కార్ నామినేషన్లకు ఎంపిక కావడం విశేషం. 'సాగర సంగమం' బెంగళూరులో 575 రోజులు ఆడి అరుదైన రికార్డు సృష్టించింది. తన కెరీర్‌లో అత్యధికంగా కె. విశ్వనాథ్‌తో సినిమాలు తీసి, కళాత్మక విలువలకు పట్టం కట్టారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారంతో పాటు అనేక లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డులను అందుకున్నారు.

**నిర్మాతగా ఆయన నిర్మించిన ప్రతి సినిమా ఒక పాఠం. వ్యాపారమే పరమావధిగా సాగుతున్న కాలంలో, సంస్కృతిని ప్రతిబింబించే సినిమాలు తీయవచ్చని నిరూపించిన ఏడిద నాగేశ్వరరావు, తెలుగు సినీ పుస్తకంలో ఒక చెరగని సంతకంగా మిగిలిపోయారు. 2015లో ఆయన భౌతికంగా కన్నుమూసినప్పటికీ, ఆయన అందించిన ఆణిముత్యాల వంటి చిత్రాలు వెండితెరపై నిరంతరం వెలుగుతూనే ఉంటాయి.**


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ రేస్‌లో ఒత్తిడి

## ప్రతి మ్యాచ్ కీలకంగా మారిన పరిస్థితి

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ జట్టు సీజన్‌ను మంచి ఆరంభంతో మొదలుపెట్టినా, ప్రస్తుతం ప్లేఆఫ్స్ రేస్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తొలి మ్యాచ్‌లో కోల్కతా నైట్ రైడర్స్‌పై విజయం సాధించిన ముంబై, ఆ తర్వాత వరుసగా ఫామ్ కోల్పోవడంతో ఇబ్బందుల్లో పడింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో వాంఖడేలో జరిగిన తాజా మ్యాచ్‌లో ఓటమి జట్టును మరింత వెనక్కి నెట్టింది. హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడి కేవలం 2 విజయాలు మాత్రమే నమోదు చేసింది. 4 పాయింట్లు, -0.736 నెట్ రన్ రేట్‌తో జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ప్లేఆఫ్స్‌కు చేరాలంటే కనీసం 16 పాయింట్లు అవసరం కావడంతో మిగిలిన 7 మ్యాచ్‌లు ముంబైకి అత్యంత కీలకంగా మారాయి. అందులో కనీసం 6 మ్యాచ్‌లు గెలిస్తేనే టాప్-4లో స్థానం దక్కే అవకాశం ఉంటుంది. 5 విజయాలు సాధించినా 14 పాయింట్లకు చేరుతుంది గానీ, అది నెట్ రన్ రేట్, ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. గత చరిత్ర చూస్తే ముంబై ఇండియన్స్ ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి పుంజుకున్న సందర్భాలు ఉన్నాయి. 2015 సీజన్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలో మొదట్లో ఇబ్బంది పడిన జట్టు, ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుని టైటిల్ గెలుచుకుంది. గత సీజన్‌లో కూడా చివరి దశలో బలమైన ప్రదర్శనతో ప్లేఆఫ్స్ చేరింది. అయితే ఈసారి పోటీ మరింత కఠినంగా ఉండటంతో ముంబైకి ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలో స్థిరత్వం చూపించకపోతే ప్లేఆఫ్స్ రేస్ మరింత క్లిష్టమయ్యే అవకాశం ఉంది.



# వైభవ్ బలహీనతను పట్టేసిన ప్రఫుల్ హింజ్..

## తొలి ఓవర్‌లోనే గేమ్ టర్న్

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ ప్రఫుల్ హింజ్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ బలహీనతను అద్భుతంగా క్యాచ్ చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అరుదైన ఘనతగా, తన తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన హింజ్, ఫామ్‌లో ఉన్న సూర్యవంశీని గోల్డెన్ డక్‌గా వెనక్కి పంపాడు. మ్యాచ్ అనంతరం హింజ్ మాట్లాడుతూ, సూర్యవంశీకి షార్ట్ బాల్ మీద పుల్ షాట్ ఆడే అలవాటు ఉందని ముందే అంచనా వేసినట్లు చెప్పాడు. అదే కారణంగా బౌన్సర్‌తో ప్లాన్ చేశామని, బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ సూచనలతో ఆ వ్యూహాన్ని అమలు చేసినట్లు వెల్లడించాడు. అనుకున్నట్టుగానే బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతికి సూర్యవంశీ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించి టైమింగ్ మిస్ అయ్యాడు. బంతి టాప్ ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతిలో పడటంతో అతని ఇన్నింగ్స్ ముగిసింది. ఈ ఒక్క వికెట్‌తోనే మ్యాచ్ స్వరూపం మారిపోయింది. తొలి ఓవర్‌లోనే హ్యాట్రిక్ వికెట్లతో రాజస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టిన హింజ్, మొత్తం నాలుగు వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ 57 పరుగుల తేడాతో విజయం సాధించింది.





# కోహ్లీ గర్జన

## ఆర్సీబీ విజయం!

### 5 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ ఘన విజయం

**వృథా అయిన సాయి సుదర్శన్ సూపర్ సెంచరీ**

**చెలరేగిన కింగ్ కోహ్లీ, దేవ్ దత్ పడిక్కల్**

**చేతులెత్తేసిన గుజరాత్ టైటాన్స్ బౌలర్లు**



**బెంగళూరు, ఏప్రిల్ 24:** చిన్నస్వామి స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అద్భుత విజయం సాధించింది. గుజరాత్ టైటాన్స్ (జీటీ) నిర్దేశించిన 206 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టాస్ గెలిచిన ఆర్సీబీ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు 18.5 ఓవర్లలోనే 206 పరుగులు చేసి సొంతగడ్డపై సగర్వంగా విజయం సాధించింది.

### సాయి సుదర్శన్ సూపర్ సెంచరీ

తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు చెలరేగి ఆడారు. ముఖ్యంగా యువ సంచలనం సాయి సుదర్శన్ ఆకాశమే హద్దుగా విజృంభించాడు. కేవలం 58 బంతుల్లోనే అద్భుతమైన సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. అతనికి తోడుగా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ 24 బంతుల్లో 32 పరుగులు, విధ్వంసకర బ్యాటర్ జోస్ బట్లర్ 16 బంతుల్లో 25 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ, జోష్ హజిల్‌వుడ్ తలా ఒక వికెట్ తీసినా భారీగా పరుగులు సమర్పించుకున్నారు.



### కోహ్లీ, పడిక్కల్ విధ్వంసం

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ బ్యాటర్లు ఏమాత్రం తడబడలేదు. కింగ్ విరాట్ కోహ్లీ తనదైన శైలిలో పరుగుల వరద పారించాడు. కేవలం 44 బంతుల్లోనే 81 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. అతనికి జత కలిసిన దేవ్ దత్ పడిక్కల్ కూడా బౌండరీలతో విరుచుకుపడ్డాడు. 27 బంతుల్లోనే 55 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో కృనాల్ పాండ్యా 12 బంతుల్లో 23 పరుగులు చేసి అజేయంగా నిలిచి లాంఛనాన్ని పూర్తి చేశాడు.

### చేతులెత్తేసిన జీటీ బౌలర్లు

లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో గుజరాత్ బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. రషీద్ ఖాన్ 4 ఓవర్లలో 49 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. మహ్మద్ సిరాజ్, మానవ్ సుతార్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఆర్సీబీ బ్యాటర్ల దూకుడుకు జీటీ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. సొంతగడ్డపై అభిమానుల కేరింతల మధ్య ఆర్సీబీ సాధించిన ఈ అద్భుత విజయం టోర్నీలో వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.





# సన్‌రైజర్స్ ,ఆర్ఆర్ మధ్య ప్రతీకార పోరేనా?

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) మధ్య శనివారం జరగబోయే మ్యాచ్‌పై భారీ ఆసక్తి నెలకొంది. తొలి దశలో హైదరాబాద్ 57 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని రాజస్థాన్ రాయల్స్ ఈ మ్యాచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆ మ్యాచ్‌లో యువ పేసర్ ప్రఫుల్ హింజ్ తన ఐపీఎల్ అరంగేట్రంలోనే తొలి ఓవర్‌లో మూడు వికెట్లు తీసి రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీని గోల్డెన్ డక్‌గా ఔట్ చేయడం ఆ జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ఆ పరాజయం ఇప్పటికీ రాజస్థాన్ క్యాంప్‌లో చర్చనీయాంశంగానే ఉంది. ఇక రేపటి మ్యాచ్ సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరగనుండటంతో తమ హోమ్ గ్రౌండ్‌లో సత్తా చాటాలని రాజస్థాన్ చూస్తోంది. ఇటీవల లక్నోపై విజయం సాధించి మంచి ఫామ్‌లో ఉన్న ఆ జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ మంచి ఫామ్‌లో ఉండగా, జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ విభాగానికి బలం అందిస్తున్నాడు. అయితే కెప్టెన్ రియాన్ పరాగ్ ఫామ్ మాత్రం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు సన్‌రైజర్స్





హైదరాబాద్ తన అటాకింగ్ బ్యాటింగ్‌తో దూకుడు కొనసాగిస్తోంది. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, ట్రావిస్ హెడ్ వంటి బ్యాటర్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ మంచి ఫామ్‌లో ఉండటం బ్యాటింగ్‌కు మరింత బలం ఇచ్చింది. బౌలింగ్‌లో ప్రఫుల్ హింజ్ వంటి యువ ఆటగాళ్లు మంచి ప్రభావం చూపుతున్నా, పాట్ కమిన్స్ లేకపోవడం జట్టుకు కొంత లోటుగా మారింది. ఈ నేపథ్యంలో ఒకవైపు ప్రతీకారం తీర్చుకోవాలన్న రాజస్థాన్ ఉత్సాహం, మరోవైపు ఆధిపత్యం కొనసాగించాలన్న హైదరాబాద్ లక్ష్యం ఈ మ్యాచ్‌ను హై ఓల్టేజ్ పోరుగా మార్చాయి. క్రికెట్ అభిమానులకు ఇది మరో ఉత్కంఠభరితమైన సమరంగా నిలవనుంది.



## బ్లాక్ బాడీకాన్‌లో మత్తెక్కిస్తున్న సంయుక్త

సంయుక్తా మేనన్ తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ బాడీకాన్ డ్రెస్‌లో స్టైలిష్ గ్లామర్ లుక్‌తో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. మౌవ్ షేడ్ సాటిన్ ఆఫ్ షోల్డర్ డిజైన్‌తో ఉన్న డ్రేప్ ఆమె అవుట్‌ఫిట్‌కు హై ఫ్యాషన్ టచ్‌ను తీసుకొచ్చింది. వైన్ కలర్ ఫాబ్రిక్ భుజాలపై అందంగా మడతలు పడుతూ ఎలిగెంట్ లుక్‌ను క్రియేట్ చేసింది. వేవీ బ్రౌన్ హెయిర్, మెరిసే స్కిన్ టోన్, డైమండ్ డ్రాప్ ఇయరింగ్స్ కలిసి ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేశాయి. క్లోజ్ అప్ షాట్‌లో సంయుక్తా చూపులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బ్రౌన్ కళ్లతో పాటు డస్కీ రోజ్ లిప్ షేడ్ ఆమె లుక్‌కు అదనపు పవర్‌ను ఇచ్చింది. మొత్తం లుక్‌లో ఆమె దుస్తులు మాత్రమే కాదు, ఆ స్టైల్‌ను పూర్తిగా తనదిగా మలుచుకుని మెరిసింది



## యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్న దీపిక

షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా జరుగుతోన్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆమెపై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రెండోసారి తల్లి కానున్నట్లు దీపిక ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తగ్గిస్తారని అంతా అనుకున్నారు. దానికి భిన్నంగా ఏప్రిల్ 21, 22 తేదీల్లో దీపిక భారీ యాక్షన్ సీన్స్ చేశారట. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ పోరాట సన్నివేశాలు రూపొందించినట్లు సమాచారం. త్వరలోనే 8 మందితో కూడిన ఫైట్ సన్నివేశాన్ని కూడా సిద్ధార్థ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇసుకలో ఫైట్ తీయనున్నారట. షారుక్, దీపిక ఇద్దరూ కలిసి ఫైట్ చేయనున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మరోవైపు ఈ సినిమా విడుదలను డిసెంబర్ 24కే ఖరారు చేస్తూ టీమ్ తాజాగా కొత్త వీడియోను పంచుకుంది. దీంతో అనుకున్న సమయానికి సినిమా వస్తుందా? రాదా? అనే వార్తలకు చెక్ పడింది. క్రిస్మస్‌కు కింగ్ సందడి షురూ అంటూ అభిమానులు ఆ వీడియోను పంచుకుంటున్నారు.



## రెడ్ డ్రెస్‌లో రకుల్ హాట్ లుక్..

అయుష్మాన్ ఖురానా నటిస్తున్న తాజా కామెడీ చిత్రం 'పతి పత్ని ఔర్ వో దో'లోని కొత్త పాట "రోప్ ది రాణి" ప్రమోషన్లతో రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పాట ప్రచారంలో భాగంగా రకుల్ విడుదల చేసిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బోల్డ్ రెడ్ మినీ డ్రెస్‌లో, ఆకట్టుకునే రఫుల్ షోల్డర్స్‌తో ఆమె కనిపించి గ్లామర్ లుక్‌తో అభిమానులను మెస్మరైజ్ చేసింది. గోల్డ్ హూప్ ఇయరింగ్స్, స్లీక్ హెయిర్ స్టైల్ ఆమె లుక్‌కు మరింత హైలైట్‌గా నిలిచాయి. "రోప్ ది రాణి" టీజర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి హైప్ క్రియేట్ చేసింది. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్‌తో పాటు అయుష్మాన్ ఖురానా, వామికా గబ్బి, సారా అలీ ఖాన్ కలిసి చేసిన డాన్స్ మూమెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రంగురంగుల విజువల్స్, ఎనర్జిటిక్ మ్యూజిక్‌తో సినిమా స్టైల్‌ను టీజర్ స్పష్టంగా చూపిస్తోంది. ఈ చిత్రం 2026 మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త పాట కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## స్టార్ హీరోల కోసం 'యంగ్ బ్యూటీస్' రిస్క్

**క్రేజీ ప్రాజెక్టులకే మొగ్గు!**

**ఎన్టీఆర్ 'డ్రాగన్' కోసం ఇతర ఆఫర్లను వదులుకున్న రుక్మిణి వసంత్**

**నాని - శ్రీకాంత్ ఓదెల మూవీపైనే కయ్యదు లోహర్ ఆశలు**

టాలీవుడ్‌లో గ్లామర్ ప్రపంచం ఎప్పుడూ అవకాశాల వేటలో ఉంటుంది. కానీ, ఇద్దరు యంగ్ హీరోయిన్లు మాత్రం దొరికిన అవకాశాలను కాదని, కేవలం స్టార్ హీరోల సినిమాల కోసమే పట్టుబట్టి కూర్చోవడం ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. భారీ ప్రాజెక్టులు హిట్ అయితే కెరీర్ మలుపు తిరుగుతుందనే నమ్మకంతో వారు ఇతర పెద్ద ఆఫర్లను కూడా సున్నితంగా తిరస్కరిస్తున్నారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ రుక్మిణి వసంత్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీపై గట్టి ఫోకస్ పెట్టింది. గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'డ్రాగన్'లో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే, ఈ సినిమా షూటింగ్‌కు భారీగా డేట్స్ అవసరం కావడంతో, ఆమె చేతికి వచ్చిన మరో మూడు, నాలుగు పెద్ద సినిమాల ఆఫర్లను వదులుకున్నట్లు వినికిడి. ప్రశాంత్ నీల్ సినిమాలో ఛాన్స్ వస్తే కెరీర్ నెక్స్ట్ లెవెల్‌కు వెళుతుందని ఆమె భావిస్తోంది. మరోవైపు, నేచురల్ స్టార్ నాని -- శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై కయ్యదు లోహర్ భారీ ఆశలు పెట్టుకుంది. 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర దక్కడంతో, ఆమె ఇతర చిన్న సినిమాల వైపు చూడటం లేదని టాక్. ఈ ఒక్క సినిమా షూటింగ్‌కే ఆమె తన సమయాన్ని పూర్తిగా కేటాయించిందట. కేవలం ఒక్క సినిమా కోసం ఇతర అవకాశాలను వదులుకోవడం ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెద్ద రిస్క్ అని కొందరు అభిప్రాయపడుతుంటే, స్టార్ సినిమాలతో వచ్చే 'బిగ్ బ్రేక్' ముందు ఇవన్నీ చిన్నవని మరికొందరు విశ్లేషిస్తున్నారు. ఈ ముద్దుగుమ్మల ప్లాన్ ఎంతవరకు ఫలిస్తుందో తెలియాలంటే ఆ సినిమాలు విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com